# ఆంధ్రజ్యోతి

## పల్నాడు జిల్లా వార్తలు

శనివారం 12 అక్టోబరు 2024

### చివరి రోజు.. కిక్కు

- మద్యం దరఖాస్తులకు ముగిసిన గడువు
- ఫీజు చెల్లించిన వారి నుంచి రాత్రి వరకు స్వీకరణ
- గుంటూరు జిల్లాలో అత్యధికంగా దరఖాస్తుల దాఖలు
- వ్యాపారుల సిండికేట్‌తో బాపట్ల జిల్లాలో తగ్గిన వైనం



### రాష్ట్రంలో 1450 బస్సులు కొనుగోలు

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



బస్సును ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన

### ఐసీఐసీఐ బ్యాంకులో కొనసాగిన సీఐడీ విచారణ

2 లో..




### మహిషాసురమర్ధినీ..

# జయ జయహే

దేవీశరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్ధిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జయజయహే మహిషాసురమర్ధిని కీర్తనలతో భక్తులు పులకించిపోయారు. శనివారం దసరా పండుగ సందర్భంగా ఆలయాలు కిటకిటలాడాయి. అమ్మవారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపునకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

- నరసరావుపేట



యడ్లపాడు: మహిషాసుర మర్ధిని అలంకారంలో సొలస బ్రహ్మంగారి ఆలయంలోని అమ్మవారు



వినుకొండ: మహిషాసురమర్ధిని అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు



పిడుగురాళ్ల: కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో కరెన్సీ నోట్లతో అలంకరణ



అచ్చంపేటలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో కాళికాదేవిగా అమ్మవారు



నరసరావుపేట: శృంగేరి శంకరమఠంలో చండీ అలంకారంలో శ్రీశారదాంబ అమ్మవారు



# పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు


మంత్రి సుభాష్‌కు స్వాగతం పలుకుతున్న ఈవో వేమూరి గోపి, అర్చకులు

## అమరేశ్వరుని సన్నిధిలో మంత్రి సుభాష్

అమరావతి, అక్టోబరు 11: పంచారామ పుణ్యక్షేత్రాలలో ప్రథమ ఆరామంగా పేరుగాంచిన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ శుక్రవారం సందర్శించారు. మంత్రికి ఆలయ ఈవో వేమూరి గోపి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సుభాష్ పేరుమీద వేదపండితులు స్వామివార్లకు పూజలు నిర్వహించి ఆశీర్వచనం తీర్థప్రసాదాలు అందజేశారు.

**కన్నుల పండువగా చండీ కళ్యాణం**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం చండీ కళ్యాణం నిర్వహించారు. ఆలయ వేద పండితులు, అర్చకులు వేద మంత్రోశ్చరణలతో మంగళవాయిద్యాల నడుమ స్వామివార్ల కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. కార్యక్రమంలో ఈఓ వేమూరి గోపితో పాటు భక్తులు పాల్గొన్నారు. శనివారం విజయదశమి రోజున స్వామివార్ల గ్రామోత్సవం జరుగుతుందని అర్చకులు తెలిపారు.


గ్రామస్థులతో మాట్లాడుతున్న సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు

## పండుగను శాంతియుతంగా జరుపుకోండి

● గ్రామస్థులతో సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు

క్రోసూరు, అక్టోబరు 11 : ఎటువంటి కవ్వింపు చర్యలకు పాల్పడకుండా దసరా పండుగను శాంతి యుతంగా జరుపుకోవాలని, వివాహాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన హసానాబాద్, నాగవరం, బయ్యవరం గ్రామాల్లో పర్యటించి ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షించారు. గ్రామ పెద్దలు ఎటువంటి గొడవలు జరగకుండా చూడాలని, కవ్వింపు చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఉత్సవాల్లో డీజేలు పెట్టుకోకూడదని, అనవసరపు గొడవలకు పోకూడదని, ఎవరి గృహాల్లో వారు పూజలు నిర్వహించు కోవటం, పండుగను జరుపుకోవటం వంటివి చేసుకోవాలన్నారు. ఆయన వెంట సీఐ పీ సురేష్, క్రోసూరు ఎస్ఐ నాగేంద్రబాబు తదితరులు ఉన్నారు.

గురజాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో

## మద్యం దుకాణాలకు 238 దరఖాస్తులు

గురజాలటౌన్, అక్టోబరు 11: మద్యం షాపులకు దరఖాస్తు ప్రక్రియ శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. గురజాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 15 మద్యం దుకాణాలకు 238 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ బుజ్జిబాబు తెలిపారు. గురజాలలో 84, దాచేపల్లిలో 114, రెంటచింతలలో 40 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ. 4.76 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. ఈనెల 14వ తేదీన నరసరావుపేటలోని టౌన్ హాలులో లాటరీ పద్ధతి జరుగుతుందన్నారు. లాటరీలో పేర్లు వచ్చిన వారు 16వతేదీ నుంచి మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చని సీఐ తెలిపారు.

## ప్రతి షాపునకు డబుల్ డిజిట్

పిడుగురాళ్ల, అక్టోబరు 11: పిడుగురాళ్ల, గురజాల ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో మద్యం షాపునకు దరఖాస్తులు భారీగానే అందాయి. శుక్రవారం సాయంత్రం 7 గంటలకు దరఖాస్తుల గడువు ముగిసే సమయానికి పిడుగురాళ్ల, మాచవరం, కారంపూడి మండలాల్లోని 12 మద్యం షాపులకు 317 దరఖాస్తులు అందాయి. సగటున ఒక్కో షాపుకు 26 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ అధికారులు ధ్రువీకరిస్తున్నారు. అదేవిధంగా గురజాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దాచేపల్లి, గురజాల, రెంటచింతల మండలాల్లోని 15 మద్యం షాపులు వుండగా 238 దరఖాస్తులు అందాయి. సరాసరి సగటున ఒక్కో మద్యం షాపులకు 15 నుంచి 20 వరకు దరఖాస్తులు అందాయని ఎక్సైజ్‌శాఖ అధికారులు ధ్రువీకరిస్తున్నారు. మద్యం షాపులకు వచ్చిన దరఖాస్తుల గడువు శుక్రవారం సాయంత్రంతో ముగిసింది.

## మాల మహానాడు నేతల నిరసన ర్యాలీ

సత్తెనపల్లి, అక్టోబరు 11 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు పునః పరిశీలించాలని కోరుతూ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ జరిగింది. మార్కెట్ యార్డు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా అరుణకుమార్, గోదా జన్‌పాల్ మాట్లాడుతూ దేశంలో దళిత గిజనుల రిజర్వేషన్లు ఎత్తివేసే పక్రియ ప్రారంభమైదన్నారు. ప్రభుత్వ పెద్దల కన్నుసన్నల్లోనే వర్గీకరణపై తీర్పు వచ్చిందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకునే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఉండల న్నారు. అంబేద్కర్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో కుచిపూడి జాన్‌బాబు, ఎం పద్మారావు, మహేష్, ప్రబాకర్, జగదీశ్, ఎం సుధాకర్, డేవిడ్, కోడిరెక్క దేవదాసు, దావులూరి కోటేశ్వరరావు, జడ ప్రసాద్, పాటిబండ్ల రామారావు తదితరులు ఉన్నారు.


గింజుపల్లి కృష్ణా నది వద్ద లారీలు, ట్రాక్టర్లు వెళ్ళకుండా రోడ్డుకు అడ్డంగా తవ్విన గాడి

## గింజుపల్లి వద్ద కృష్ణానది నుంచి గాడి

● ఆంధ్రజ్యోతికి స్పందన ● తహసీల్దారు పరిశీలన

అచ్చంపేట, అక్టోబరు 11: మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలో గల గింజుపల్లి వద్ద కృష్ణా నదిలోకి ట్రాక్టర్లు, లారీలు వెళ్ళకుండా గాడి తవ్వించినట్టు మండల తహసీల్దార్ బీ శ్రీనివాస్ తెలిపారు. గింజుపల్లి వద్ద కృష్ణా నదిలో ఇసుక కొరకు అక్రమంగా లారీలు, ట్రాక్టర్లు వెళ్తున్న నేపథ్యంలో ఈ గాడిని తీయించామని ఆయన తెలిపారు. అక్రమ ఇసుక రవాణా పై చట్ట పరమైన చర్యలు చేపడతామని తహసీల్దార్ అన్నారు.

## 14 నుంచి పల్లె పండుగ

మాచవరం, అక్టోబరు11: ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పీ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. 14న చెన్నాయపాలెం, రేగులగడ్డ, 15న కొత్తపాలెం, తురకపాలెం, 16న పిల్లుట్ల, మల్లవోలు, 17న కొత్తగణేశునిపాడు, శ్రీ రుక్మిణీపురం, నాగేశ్వరపురం తండాకు చెందిన గంగిరెడ్డిపాలెం, పిన్నెల్లి, మాచవరం, 19వ తేదీన మోర్జంపాడు, గోవిందాపురం, సింగరాయపాలెం తండా గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద మంజూరైన నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, ఉపాధి హామి సిబ్బంది తగిన ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా ఎంపీడీవో సూచించారు.

## పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయండి

● పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు


పార్టీ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, అక్టోబరు11: గురజాల నియోజకవర్గపరిధిలో పట్టభద్రులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పార్టీ నేతలకు సూచించారు. శుక్రవారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో 4 మండలాల కూటమి నేతలతో సమీక్ష నిర్వహించారు. నవంబరు 6వ తేదీ వరకు పట్టభద్రుల ఓటరుగా నమోదు చేసే అవకాశం వుందని, గ్రామాలు, పట్టణాలలో పట్టభద్రులను గుర్తించి ఓటరుగా నమోదు చేసేందుకు కూటమి సభ్యులు చురుకైన పాత్ర పోషించాలన్నారు. పార్టీ నిర్ణయించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించేందుకు పట్టభద్రుల ఓటు ఎంతో అవసరమని యరపతినేని గుర్తుచేశారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలో వివిధ గ్రామాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, గత ప్రభుత్వంలో మధ్యలోనే వదిలేసిన పనులపై ఎమ్మెల్యే యరపతినేని పార్టీ నేతలతో సమీక్ష నిర్వహించారు. అదేవిధంగా పల్నాడు ప్రాంతంలో మేజర్, మైనర్ కాల్వల ఆధునికీకరణ పనులకు తాను శ్రీకారం చుట్టానని, దీనివల్ల లక్షన్నర ఎకరాలకు పైగా సాగునీరు అందటమే కాకుండా వేలాది మంది రైతులకు సాగునీటి కష్టాలు తప్పనున్నాయని యరపతినేని తెలిపారు. మరో పదిరోజుల లోపు మేజర్, మైనర్ కాల్వల్లో పూడికతీత, జమ్ము, నాచును తొలగించి చివరి భూముల వరకు సాగునీరు అందించటమే లక్ష్యంగా ప్రస్తుతానికి ప్రభుత్వం నుండి నిధులు మంజూరు కాకపోయినా రైతుల కష్టాలకు చెక్‌పెట్టేందుకే తాను ముందడుగు వేశానన్నారు. పార్టీ నేతలు పాండురంగ శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు, బెల్లంకొండ భద్రి, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కామిశెట్టి రమేష్, తురకా వీరాస్వామిలు మాట్లాడుతూ గురజాల నియోజకవర్గ పరిధిలో గత ఐదేళ్లుగా పంటలకు సాగునీరు అందక రైతులు అనేక కష్టాలు పడుతున్నారని, ఆ ఇబ్బందులను తొలగించేందుకు ఎమ్మెల్యే యరపతినేని ముందడుగు వేయడం అభినందనీయమని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## 4 గంటల అలస్యంగా జన్మభూమి ఎక్స్‌ప్రెస్

సత్తెనపల్లి, అక్టోబరు11: విశాఖపట్టణం నుంచి లింగంపల్లి వెళ్లే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ శుక్రవారం నాలుగు గంటలు అలస్యంగా నడిచింది. సత్తెనపల్లికి మధ్యాహ్నం రెండు గంటలకు రావాల్సిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు సాయంత్రం ఆరు గంటలకు సత్తెనపల్లి స్టేషన్‌కు వచ్చింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.


రైల్వే స్టేషన్‌లో రైలు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

## నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, అక్టోబరు 11: నాగార్జున సాగర్ జలాశయం నీటి మట్టం శుక్రవారం నాటికి 589.70 అడుగులు ఉంది. ఇది 311.14 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9,767 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 9166 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,110 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 50,843 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 50,843 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.



## మోడల్ స్కూల్ వరకు ఆర్టీసీ బస్సు నడపాలి

● పాఠశాలకు అర కిలోమీటరు నడుస్తున్న విద్యార్థులు

● డిపో మేనేజర్లకు వినతి పత్రాలు పంపిన ఎమ్మెల్యే ప్రవీణ్

క్రోసూరు, అక్టోబరు 11 : క్రోసూరుకి సుమారు రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న మోడల్ స్కూల్ వరకు ఆర్టీసీ బస్సును నడపాలని సీపీఎం నాయకులు శుక్రవారం డిమాండ్ చేశారు. అమరావతి - క్రోసూరు రహదారిలోని బయ్యవరం, ఊటుకూరు, విప్పర్ల, క్రోసూరుకు చెందిన విద్యార్థులు అనేక మంది మోడల్ స్కూల్‌లో చదువుతున్నారని, క్రోసూరు నాలుగు రోడ్ల సెంటర్‌లో దిగి విద్యార్థులు స్కూళ్ళకు వెళ్ళాలంటే చాలా అవస్థలు పడుతున్నారని సీపీఎం నాయకులు అన్నారు. అలాగే దొడ్లేరు, అనంతవరం నుంచి వచ్చే విద్యార్థులు ప్రధాన రహదారిపై దిగాల్సి వస్తుందని, అక్కడి నుంచి పాఠశాల ఆవరణకు వెళ్ళాలంటే కిలో మీటరు వరకు నడవాల్సి వస్తుందని, అమరావతి నుంచి క్రోసూరుకు వచ్చే బస్సును పిడుగురాళ్ళ నుంచి క్రోసూరుకు వచ్చే బస్సును మోడల్ స్కూల్ వరకు పొడిగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్, పిడుగురాళ్ళ, గుంటూరు డిపో మేనేజర్లకు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌లకు వినతి పత్రాలు పంపిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంజిమాల రవిబాబు, తిమ్మిశెట్టి హనుమంతరావు, మధుసూదనరావు, గర్నెపూడి మహేష్, శాఖమూరి మోహనరావు తదితరులు మాట్లాడారు.

# త్వరలో గుంటూరుకి ఈఎస్ఐ ఆస్పత్రి

● కొలనుకొండలో కియా షోరూమ్ ప్రారంభోత్సవంలో మంత్రి లోకేశ్



వేదికపై మంత్రులు లోకేశ్, పార్థసారథి, రామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు

తాడేపల్లి, అక్టోబరు 11: గుంటూరులో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణాన్ని అతి త్వరలోనే చేపడతామని, అన్ని పద్ధతి ప్రకారమే చేస్తామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కొలనుకొండ బైపాస్ రోడ్డు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సింహా కియా షోరూమ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. మంగళగిరిలో ఎయిమ్స్‌కు నీటి సరఫరాతోపాటు 100 పడకల ఆసుపత్రి నిర్మాణం త్వరలో చేపడతామని, మూడు నెలల్లో మంగళగిరిలో భూగర్భ డ్రైయినేజీ పనులు చేపడతామని తెలిపారు. దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వారికి పట్టాలు ఇస్తామని, పార్టీలో కష్టపడిన వారికి నామినేటెడ్ పోస్టులు ఇస్తామని వివరించారు. రోడ్ల నిర్మాణం కూడా త్వరలోనే చేపడతామని, ఐదేళ్లలో రోడ్లను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఫేక్ న్యూస్ ప్రచారంపై కఠిన చర్యలు తప్పవని, వరద సాయంపై వైసీపీ దుష్ప్రచారం చేస్తుందని అన్నారు. దాదాపు పది రోజులకు పైగా సీఎం చంద్రబాబు నాయుడు మంత్రివర్గం మొత్తం ముంపు ప్రాంత పనులను పర్యవేక్షించారని, ఆనాడు వైసీపీ ఎక్కడుందని ప్రశ్నించారు. వరద బాధితులను ఆదుకునేందుకు కోటి సాయం ప్రకటించిన జగన్ రెడ్డి ఎక్కడ ఖర్చు పెట్టాడో చెప్పాలన్నారు. సుమారు రూ.650 కోట్లకు పైగా ఖర్చు పెట్టామని, ఏమైనా లోటుపాట్లు ఉంటే సాయం అందకపోతే వివరాలు ఇవ్వాలని లోకేశ్ అన్నారు. వైసీపీ మాదిరిగా మేము పరదాలు కట్టుకుని తిరగడం లేదనీ, వరదలు వస్తే జగన్ కనీసం తాడేపల్లి ప్యాలెస్ గేటు దాటలేదన్నారు. రాయలసీమకు మ్యానిఫ్యాక్టరింగ్ యూనిట్లు, సర్వీసింగ్‌లను ఉత్తరాంధ్రకు తీసుకువస్తామన్నారు. విండ్, సోలార్, పంప్ స్టోరేజి ప్రాజెక్టులు, సిమెంటు ప్యాక్టరీలు కర్నూలుకు, ఎలక్ట్రానిక్ మ్యానిఫ్యాక్చరింగ్ కంపెనీలు కడప, చిత్తూరుకు, ఆటోమొబైల్స్ అనంతపురంకు, ఉభయగోదావరికి ఆక్వా, పెట్రో కెమికల్ పరిశ్రమలు కృష్ణా, గుంటూరుకు తీసుకువచ్చి అభివృద్ధి వికేంద్రీకరణకు కట్టుబడి ఉన్నామన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ఎన్ని కంపెనీలు తీసుకువచ్చారు, ఎన్ని ఉద్యోగాలు కల్పించారో బహిర్గతం చేయాలన్నారు. బుక్‌ల విషయంలో వైసీపీ నన్ను చూసి ఇన్‌స్పైర్ అయినట్టుందన్నారు.

**అట్టహాసంగా కియా కార్ల షోరూమ్ ప్రారంభం**

తాడేపల్లి బైపాస్ రోడ్ కొలనుకొండలో సుమారు 2.5 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కియా కార్ల షోరూమ్‌ను మంత్రి లోకేశ్ ప్రారంభించారు.

# మంత్రులతో ఎమ్మెల్యే అరవిందబాబు భేటీ


ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో బేటీ అయిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, కపలవాయి విజయకుమార్


రోడ్లు,భవనాల శాఖ మంత్రి జనార్ధనరెడ్డితో ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 11: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఆయన చాంబర్‌లో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. పల్నాడు జిల్లాతో పాటు డివిజన్ కేంద్రమైన నరసరావుపేట నియోజకవర్గానికి సంబంధించి అభివృద్ధి కార్యక్రమాలను చర్చించారు. పలు గ్రామాలకు వెళ్ళే మార్గాలలో చప్టాలు ఉన్నాయని, భారీ వర్షాలు, వాగులు పొంగే సమయాలలో చప్టాలు ప్రమాదకరంగా మారాయన్నారు. చప్టాలుగా ఉన్న వాటిని హైలెవల్ బ్రిడ్జిలుగా మార్చేందుకు నిధులు కేటాయించాలన్నారు. వైసీపీ పాలనలో రోడ్లను పట్టించుకోలేదన్నారు. నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలోనూ పలు వార్డులు, ప్రధాన రహదారులలో సైతం బ్రిడ్జిలు అవసరం ఎంతో ఉందన్నారు. అదేవిధంగా రహదారుల అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. జిల్లా కేంద్రం కావడంతో రాష్ట్ర స్థాయి అధికారులు, మంత్రులు వివిధ కార్యక్రమాలలో పాల్గొనేందుకు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్ల విస్తరణ అవసరమైందన్నారు. మల్లమ్మ సెంటర్ వంటి ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఫ్లై ఓవవర్ ఏర్పాటు అత్యవసరం అన్నారు. రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించి, తమ ప్రతిపాదనలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కాగా అనంతరం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిశారు. నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో చేపట్టవలసిన అభివృద్ధి పనులను మంత్రికి వివరించారు. కేర్ యూనిట్ లెవెల్ వన్ శంకుస్థాపనకు రావాలని ఆహ్వానించారు. నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని మంత్రి సత్యకుమార్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, లక్కీరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వేల్పుల సింహాద్రి యాదవ్, కనుమూరి లక్ష్మి, వాసిరెడ్డి రవి, వనమా శివ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రతన్ టాటాకు నివాళులు


రతన్ టాటా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, అక్టోబరు 11 : పట్టణంలోని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో శుక్రవారం రతన్ టాటా చిత్రపటానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ విలువలు, మానవత్వంతో కూడిన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన మహా దార్శనికుడు రతన్ టాటా అన్నారు. దేశాభివృద్ధి, ప్రజా శ్రేయస్సు, ఉద్యోగుల సంక్షేమమే పరమావధిగా టాటా గ్రూపు సంస్థలను దశాబ్దాలుగా అదే నిబద్ధతతో నిర్వహించిన పద్మభూషణ్ రతన్ టాటా సేవలు చిరస్మరణీయమన్నారు. టాటా గ్రూపు ఉత్పత్తులు వాడని భారతీయులు ఉండరన్నారు. రతన్ టాటా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా జీవించి ఉంటారన్నారు. నమ్మకమైన టాటా ఉత్పత్తులరూపంలో ప్రతి ఇంటిలో అందరినీ ప్రతిరోజు పలకరిస్తునే ఉంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, పట్టణ కార్యదర్శి నూర్ బాషా జాన్‌బాబు, నాయకులు పూజల వెంకట కోటయ్య, బత్తుల ఆదినారాయణ, దరువూరి నాగేశ్వరరావు, కొల్లా వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.


గోతులమయంగా ఉన్న వినుకొండ రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి

# అధ్వానంగా రైల్వే స్టేషన్ రహదారి

వినుకొండ టౌన్, అక్టోబరు 11: రైల్వే స్టేషన్‌కు రావాలంటే ప్రయాణికులు వణికిపోతున్నారు. దొంగల తాకిడికి మహిళలు భయాందోళనలు చెందుతున్నారు. రైల్వే స్టేషన్ నుంచి ఏనుగుపాలెం వెళ్లే రోడ్డులో ప్రయాణికులకు భద్రత కరువైంది. ఇటీవల రైల్వే గుత్తేదారులు ఏర్పాటుచేసిన పెద్ద పెద్ద కాంక్రీట్ దిమ్మల తయారీ ప్రాంతంలో ఏపుగా పెరిగినచెట్లు మధ్య హిజ్రాలు, ఆకతాయిలు మద్యం, గంజాయి మత్తులో దాడులకు పాల్పడడం పరిపాటిగా మారింది. ఇటీవల కాలంలో ప్రకాశం జిల్లాకు చెందిన ఇద్దరు రైలు దిగి వస్తుండగా, వారిపై ఆకతాయిలు దాడి చేసి చేతిలో బ్యాగ్‌తోపాటు, సెల్ ఫోన్ తస్కరించి పరారైయ్యారు. ఇదిలా ఉండగా స్టేషన్ పరిధిలో సీసీ కెమేరాలు పని చేయకపోవడంతో ఇదే అదునుగా భావించి దొంగలు ప్రయాణికుల నుంచి విలువైన వస్తువులతో పాటు, సెల్‌ఫోన్ దొంగతనాలు పెరిగాయి. నరసరావుపేట వైపు ప్లాట్‌ఫారంపై గంజాయి బ్యాచ్ ఆగడాలు పెరిగిపోయినప్పటికీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో అడవిని తలపించే చెట్ల కారణంగా దొంగలు తప్పించుకునేందుకు అనువుగా మారింది.

ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా వాహనాల రాపోకల కారణంగా రోడ్లు పూర్తిగా దెబ్బతిని ప్రయాణికులు రైల్వే స్టేషన్ రావాలంటే తీవ్ర ఇబ్బందులు గురౌతున్నారు. ఏనుగుపాలెం రైల్వే గేట్ సమీపంలో గత కొంతకాలంగా రైల్వే గుత్తేదారులు వాహనాల కారణంగా రోడ్లు పూర్తిగా ధ్వంసమై రాక పోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైల్వే రోడ్లు ఆధునికీకరించి, ప్రయాణికులకు భద్రత కల్పించి, స్టేషన్ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటుచేసి హిజ్రాలు, గంజాయి బ్యాచ్, దొంగల బారినుంచి భద్రత కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


ఆకతాయిలకు అడ్డాగా మారిన రైల్వే స్టేషన్ ఆవరణ

## మద్యం షాపులకు ముమ్మరంగా దరఖాస్తులు

● క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 317 అప్లికేషన్‌లు

క్రోసూరు, అక్టోబరు 11 : క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం దరఖాస్తుల దాఖలకు చివరి రోజు కావటంతో ముమ్మరంగా అప్లికేషన్‌లు దాఖలయ్యాయి. జిల్లా ఉన్నతాధికారులు అప్లికేషన్‌ల దాఖలను పర్యవేక్షించారు. 10వ తేదీ సాయంత్రం వరకు 140 అప్లికేషన్‌లు మాత్రమే దాఖలు కాగా 11వ తేదీ చివరి రోజు 177 అప్లికేషన్‌ల వరకు వచ్చాయని ఎక్సైజ్ సీఐ టీ తులసీ తెలియచేశారు. క్రోసూరు స్టేషన్‌లో మద్యం అప్లికేషన్‌ల దాఖలను కొంత మంది అడ్డుకుంటున్నారని వార్తలు వెలువడటంతో జిల్లా ఉన్నతాధికారులు స్టేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపారు. నలుగురు ఉన్నతాధికారులు స్టేషన్‌ను సందర్శించి దరఖాస్తు దాఖలు విధానాన్ని పరిశీలించారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ సుధాకరరెడ్డి, గుంటూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ రవి కుమార్‌రెడ్డి, గుంటూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జీ సూర్యనారాయణ, మరో ఎక్సైజ్ సీఐ రేఖ దగ్గరుండి అప్లికేషన్‌లు దాఖలు చేయించారు. అప్లికేషన్‌ల ద్వారా ప్రభుత్వానికి అధిక ఆదాయం సమకూర్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు వారు చెప్పారు. అప్లికేషన్ దాఖలు విధానంలోగాని, షాపుల కేటాయింపులో గాని పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని, ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేదన్నారు. కాగా అప్లికేషన్‌లు దాఖలు చేయటానికి అనేక మంది చివరి రోజు ఆసక్తి చూపారు. మొత్తం పది షాపులకుగాను మొత్తం 317 అప్లికేషన్‌లు దాఖలు కాగా మరి కొంత మందికి అప్లికేషన్‌లు వేయటానికి సిద్ధంగా ఉన్నారు. 14వ తేదీన నరసరావుపేటలోని టౌన్‌హాల్‌లో ఉదయం 8 గంటల నుంచి కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీలు తీసే ప్రక్రియ ప్రారంభమవుతుందని సుధాకరరెడ్డి తెలిపారు. 16వ తేదీ నుంచి మద్యం షాపులు ప్రారంభ మవుతాయన్నారు. క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో క్రోసూరు మండలానికి 4, అచ్చంపేట మండలానికి 4, బెల్లంకొండ మండలానికి 2 మద్యం షాపులు మంజూరయ్యాయి.

### రంగ స్థల నటుడు మృతి

సత్తెనపల్లి, అక్టోబరు 11 : పట్టణానికి చెందిన ప్రముఖ రంగ స్థల నటుడు, సినీ రచయిత చైతన్య కళా స్రవంతి గౌరవ సలహాదారులు రామరాజువెంకట అప్పారావు(65) శుక్రవారం హైదరాబాద్‌లో మృతిచెందారు. అయన డాక్యుమెంట్ రైటర్‌గా, కళాకారునిగా పట్టణప్రజలకు సుపరిచితుడు. కళారంగం మంచి కళాకారుడిని కోల్పోయిందని పలువురు కళాకారులు తెలిపారు.

# పంట కాల్వలకు మహర్దశ



అభివృద్ధి పనులు చేపట్టకముందు, తర్వాత తంగెడ మేజర్

● మేజర్ కాల్వల్లో పూడికతీతతో నీటి పారుదలకు సుగమం
● నిధులు లేకున్నా అభివృద్ధి పనుల నిర్వహణ

దాచేపల్లి, అక్టోబరు 11: చేతిలో చిల్లిగవ్వ లేదు....ఎటువంటి టెండర్లు లేవు....కానీ పంట కాల్వలు పూడికతో నిండి జమ్ము, నాచు, గుర్రపుడెక్కతో నిండిపోయింది. 500 క్యూసెక్కుల కెపాసిటీ కలిగిన తంగెడ మేజర్ కాలువకు సాగర్ ఎడమ కాలువ నుండి వచ్చే నీరు విడుదల చేయగా కేవలం 300 క్యూసెక్కుల నీటితోనే కాల్వ నిండి రెండు గట్లు తన్నిపట్టి పారుతున్నాయి. ఒక్కోచోట గట్లు కూడా బలహీనమై నీళ్లు లీకేజీ అయి పంట పొలాల్లోకి పారుతున్నాయి. గత ఐదేళ్లలో కాల్వ మరమ్మతులకు నిధులు మంజూరు చేసినా మంజూరు చేసిన నిధులతో వైసీపీ నేతలు బాగుపడ్డారే తప్ప కాల్వలకు మాత్రం అభివృద్ధి జరుగలేదు. పంట కాల్వల ద్వారా సాగునీరు అందక రైతులు పంట పొలాలను బీడు పెట్టుకోవడం, మరికొందరు వర్షాధార పంట లైనకంది, పెసర, మినుము, జూట్ వంటి పంటలను సాగు చేసుకుంటూ కాలం వెల్లదీశారు. గత ఎన్నికల ప్రచారంలో గ్రామాలలో పర్యటించిన యరపతినేనికి రైతులు కాల్వల దుస్థితిని తెలియజేశారు. ప్రభుత్వం రాగానే అభివృద్ధి చేస్తామని రైతు నాయకుడిగా ఎమ్మెల్యే యరపతినేని హామీ ఇచ్చారు. రైతు కష్టాలు తెలిసిన వ్యక్తిగా అధికారంలోకి రాగానే పంట కాల్వలకు సాగునీరు అందించే మేజర్, మైనర్ కాల్వల మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. తంగెడ మేజర్ కాల్వ ద్వారా 36వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. చెన్నాయపాలెం మేజర్ ద్వారా మరో 20 వేల ఎకరాలు సాగునీరు అందుతుంది. ఈ మేజర్లకు ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని, కాల్వలు శుభ్రంగా వుండాలని లక్ష్యంతో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు నిధులు లేకపోయినా రైతుల సహాయ సహకారాలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సాగర్ డ్యామ్‌లో నీరున్నప్పటికీ పంట పొలాలకు నీరు అందకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది. ఆయా పరిస్థితులను దృష్టిలో వుంచుకొని చేపట్టిన అభివృద్ధి పనులు రైతులకు భరోసా ఇస్తున్నాయి.

**మేజర్ కాల్వలతో పాటు మైనర్లు కూడా బాగుచేయాలి**

ఆకురాజుపల్లె, చెన్నాయపాలెం, తంగెడ, రామాపురం, దైద మేజర్ కాల్వలకు మరమ్మతులు చేపట్టారు. కానీ ఆయా మేజర్ కాల్వల కింద పంట పొలాలకు సాగునీరు అందించే మైనర్ కాల్వలకు మరమ్మతులు చేపడితే బాగుంటుందని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.



కాల్వ వద్ద పనులను పర్యవేక్షిస్తున్న జలవనరులశాఖ అధికారులు, రైతులు



పిడుగురాళ్లలో షాపుల వద్ద అమ్మకానికి సిద్దంగా ఉంచిన ప్లాస్టిక్ సామగ్రి

## పొంచివున్న ప్లాస్టిక్ ముప్పు

● విచ్చలవిడిగా వస్తువుల అమ్మకాలు
● అప్పుడప్పుడు మొక్కుబడిగా అధికారుల తనిఖీలు
● క్యాన్సర్ కారకాలతో ప్రమాదమంటున్న వైద్యులు

పిడుగురాళ్ల, అక్టోబరు 11: ఒకప్పుడు ప్లాస్టిక్ వస్తువులు కనిపిస్తే చాలు మున్సిపల్ అధికారులు క్షణాలలో వాలిపోయేవారు. 50 మైక్రాన్‌ల కన్నా తక్కువ వున్న కవర్లు, గ్లాసులు, ఇస్తర్లు, మరికొన్ని వస్తువులు గుట్టుగా విక్రయించిన సందర్భాలు వున్నాయి. పిడుగురాళ్లలో 10 దాకా వున్న దుకాణాలు అధికారుల ఒత్తిళ్లతో మావల్ల కాదంటూ నలుగురు షాపులనే మూసివేశారు. అయితే నేడు అధికారులు ప్లాస్టిక్ విక్రయాలతో వచ్చే అనర్థాలతో పట్టించుకోకపోవడంతో ఎక్కడ బడితే అక్కడ విచ్చలవిడిగా ప్లాస్టిక్ వస్తువుల అమ్మకాలు యథేశ్చగా బహిరంగంగా జరుగుతున్నా అదేమిటని అడిగే వారే కరువయ్యారు. పిడుగురాళ్ల మెయిన్‌రోడ్డు, మాయబజార్, మాచర్ల బస్టాండ్ సెంటర్‌లో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, విస్తర్లు విక్రయించే దుకాణాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. కొవిడ్‌కు ముందు పిడుగురాళ్లలో ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలు జరుపాలంటేనే యజమానులు హడలిపోయారు. అలాంటిది ఇప్పుడు ఎక్కడ తేడా వచ్చిందో తెలియదుకానీ, అధికారులు వారి గురించి పట్టించుకోకపోవడంతో ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు జరుగుతున్నాయి.

**కాలుష్యమని తెలిసినా...**

నిబంధనల ప్రకారం ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల విక్రయాలతో పర్యావరణానికి హాని వస్తుందని తెలిసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. కల్యాణ మండపాలు గ్రామాలలో జరిగే శుభకార్యాలతో పాటు చిన్నపాటి విందు జరిగినా ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు విచ్చలవిడిగా కనిపిస్తున్నాయి. కార్యక్రమాలు అయిపోయాక వాటిని ఊరు చివర రహదారుల వెంట వేస్తుండటం వల్ల ప్లాస్టిక్ కవర్లన్నీ భూమిలో కలిసిపోవడం వల్ల భూగర్భజలాలు అడుగంటే అవకాశం మున్ముందు మరింత ఎక్కువయ్యే పరిస్థితి కనిపిస్తుంది. మటన్ కొట్టు వద్ద నుండి తోపుడు బండ్ల వద్ద అరటికాయల కొనుగోలు వరకు ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్లలో వేడి వేడి పదార్థాల వాడకం వల్ల క్యాన్సర్ ముప్పు వుందని వైద్యనిపుణులు వెల్లడిస్తున్నారు.

**నాడు భయం....నేడు అభయం..**

పిడుగురాళ్ల, గురజాల, దాచేపల్లి పట్టణాలలో ప్రముఖంగా కొవిడ్‌కు ముందు నుండి ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు జరపాలంటే వ్యాపారులు హడలిపోయేవారు. అధికారుల తనిఖీలు, కేసులమోతతో మావల్ల కాదంటూ వ్యాపారం మానేసిన వారు వున్నారు. అలాంటిది నాటి భయం...నేడు వ్యాపారుల్లో కనిపించడం లేదు. సంబంధిత అధికారుల నిర్లక్ష్య వైఖరో....మాముళ్ల మత్తో తెలియడం లేదు కానీ నిబంధనలు పట్టించుకోకపోవడంతో ప్లాస్టిక్ కవర్ల విక్రయాలు యథేశ్చగా జరిగిపోతున్నాయి.



లండన్‌లో మీట్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేత డాక్టర్ కోడెల శివరామ్

## లండన్‌లో కోడెల శివరామ్ పర్యటన

● మీట్ గ్రీట్ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐలతో సమావేశం
● ఎన్టీఆర్, కోడెల, రతన్ టాటా చిత్రపటాలకు నివాళులు

సత్తెనపల్లి, అక్టోబరు 11 : లండన్‌లోని టీడీపీ కార్యకర్తలు, శ్రేణులు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామ్ లండన్ పర్యటను పురస్కరించుకొని 'మీట్ గ్రీట్' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోడెల శివరామ్ రతన్ టాటా చిత్రపటానికి, డాక్టర్ కోడెల శివప్రసాదరావు చిత్రపటానికి, ఎన్‌టీఆర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లగడపాటి అంజిబాబు చిత్రపటానికి కూడా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివరామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిందని వివరించారు. భవిష్యత్‌లో కూడా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్టం మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. యువ నాయకుడు నారా లోకేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం డాక్టర్ కోడెల శివప్రసాదరావు పై తప్పుడు కేసులు పెట్టి వేదించిందన్నారు. ఇప్పుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రూ.30 కోట్లు విలువైన ప్రభుత్వ సొమ్మును వాళ్ళ ఇంట్లో పెట్టుకుని వినియోగించుకుంటున్నాడని విమర్శించారు. జగన్‌కు ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా మార్పు రాలేదన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ టీడీపీ నేతలు లగడపాటి శ్రీనివాసరావు, డాక్టర్ కోగంటి రామ కోటయ్య దంపతులు, గుంటుపల్లి జయ కుమార్, రాణా, గోగినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మీట్ గ్రీట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విజయవంతం చేసిన ఎన్‌ఆర్‌ఐ లండన్ బృందాన్ని డాక్టర్ కోడెల శివరామ్ అభినందించారు.





బతుకమ్మలకు హారతులు ఇస్తున్న మహిళలు

### భక్తిశ్రద్ధలతో బతుకమ్మ ఉత్సవాలు

క్రోసూరు, అక్టోబరు 11 : క్రోసూరులోని విద్యానగర్‌లో భక్తి శ్రద్దలతో బతుకమ్మ ఉత్సవాలు జరుగుతున్నాయి. ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచే బతకమ్మ, బతకమ్మ ఉయ్యాలో, శ్రీ గౌరి నీలేల ఉయ్యాలో అంటూ ప్రత్యేక మైన శైలిలో బతుకమ్మలను ఆడుతూ మహిళలు ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. బతుకమ్మను ఏర్పాటు చేసిన ప్రాంగణంలో విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. బతుకమ్మలకు హారతులు ఇవ్వటం, కోలాటాలు, చెక్క భజనలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. అనంతరం కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద కూడా బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. క్రోసూరు నాలుగు రోడ్ల సెంటర్‌లో మహిషాసురమర్దని దేవి ప్రతిమను ఏర్పాటు చేసి అదే ప్రదేశంలో బతుకమ్మను నెలకొల్పి ఉత్సాహంగా బతుకమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

### మద్యం షాపులకు 118 దరఖాస్తులు

మాచర్లటౌన్, అక్టోబరు 11: మాచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యం దుకాణాలకు 118 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. మాచర్ల పట్టణంలో మూడు దుకాణాలకు సంబంధించి 28, మాచర్ల రూరల్ పరిధిలో 2 దుకాణాలకు 21, వెల్దుర్తి మండల పరిధిలో 3 దుకాణాలకు 27, దుర్గి మండల పరిధిలో 2 దుకాణాలకు 42 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. శుక్రవారం సాయంత్రంతో దరఖాస్తుల గడువు ముగిసినట్లు తెలిపారు. ఈనెల 14వ తేదీన నరసరావుపేట టౌన్ హాలులో లాటరీ పద్ధతి జరుగుతుందన్నారు. లాటరీలో షాపు పొందిన వారు 16వ తేదీ నుంచి మద్యం షాపులు ఏర్పాటు చేసుకోవచ్చని ఎక్సైజ్ సీఐ వెంకటరమణ తెలిపారు.

### 289 దరఖాస్తులు

సత్తెనపల్లి, అక్టోబరు 11 : సత్తెనపల్లి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 15 మద్యం షాపులకు గాను 289 దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ సీఐ పీ విజయ కుమార్ శుక్రవారం రాత్రి తెలిపారు. దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ 98 లక్షల ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు.

కారంపూడి విద్యుత్‌శాఖ ఏఈ

### బాధ్యతల స్వీకరణ

కారంపూడి, అక్టోబరు 11: కారంపూడి మండల విద్యుత్ శాఖ ఏఈగా పెద మస్తాన్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన మాచవరం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విదులు నిర్వహించిన కోటేశ్వరరావు మాచర్లకు బదిలీపై వెళ్లారు. ఏఈ పెద మస్తాన్‌ను సిబ్బందిశంకర్, నాగరాజు, హరికృష్ణ, గోపాల్, పాపారావులు అభినందించారు.

### విధుల్లో చేరిన వీఆర్వోలు

రెంటచింతల,అక్టోబరు 11: వివిధ మండలాల నుంచి బదిలీపై వచ్చిన పలువురు వీఆర్వోలు శుక్రవారం బాధ్యతలు చేపట్టినట్లు తహసీల్దార్ జీ.కరుణ కుమార్, ఆర్ఐ పల్లా రామకృష్ణలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తుమ్మకోట వీఆర్వోగా ఎం.నరశింహారావు, మిట్టగుడిపాడుకు ఎస్.కాశయ్య,రెంటాలకు నెవలి శంకర్‌రెడ్డి, పశర్లపాడుకు టీ.లింగయ్య, మంచికల్లుకు కె.బాలయ్య, రెంటచింతల 2 కు పాశం నాసరరెడ్డిలు విధుల్లో చేరారని తహసీల్దార్ కరుణకుమార్, ఆర్ రామకృష్ణ తెలిపారు.



రోగులకు కోడిగ్రుడ్లు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

### 'వరల్డ్ ఎగ్‌డే'

● ఆస్పత్రిలో రోగులకు కోడిగుడ్లు పంపిణీ

అమరావతి, అక్టోబరు 11: వరల్డ్ ఎగ్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక సీజేబీ, పీఎల్‌ఎం ఫౌల్ట్రీస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు కోడిగ్రుడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌల్ట్రీస్ అధినేత చేకూరి లక్ష్మీ, వైద్యసిబ్బంది పాల్గొని గ్రుడ్లను అందజేశారు.



# పల్నాడులో ప్రకృతి సోయగాలు

● ఆహ్లాదానికి అడ్రస్‌గా 'అనుపు'
● మనసును మైమరిపించే ఎత్తిపోతల
● పెరుగుతున్న పర్యాటకుల సంఖ్య

ఎత్తిపోతల జలపాతం



మాచర్ల రూరల్, అక్టోబరు 11: చూసినంతనే మనసును కట్టిపడేసే అందాలు.. మంత్రముగ్ధుల్ని చేసి మరో లోకానికి తీసుకెళ్లే ప్రకృతి సోయగాలు.. ఎంత చూసినా తనివి తీరదు.. మరోమారు రావాల్సిందే అనిపించే సహజ సౌందర్యాలు.. కుటుంబ సభ్యులతో ఆహ్లాదంగా గడిపేందుకు సరైన ప్రాంతాలు.. నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే వారు కాస్తంత సేదతీరేందుకు తప్పనిసరిగా చూడాల్సిన ప్రదేశాలు అవి.. ఒకటి అందాల ఆరబోత అనుపు కాగా మరోటి 70 అడుగుల ఎత్తు నుంచి జాలువారుతూ మనుసును మైమరిపించే ఎత్తిపోతల..



అనుపులో భద్రపరిచిన శ్రీచేత్యము

**అనుపు అందాలు వర్ణణాతీతం**

మాచర్ల మండలం విజయపురిసౌత్ నుంచి 6 కి.మీ దూరంలో ఉంది అనుపు. దీని అందాలు వర్ణించడం ఎవరికీ సాధ్యం కాదు. కృష్ణానదిని ఆనుకొని ఉన్న ఈ అనుపులో కాలు పెట్టామంటే స్వచ్ఛమైన చల్లటి గాలులకు మైమరిపోవాల్సిందే. క్రీ.శ 4వ శతాబ్దం కంటే ముందు నాటి వైభవాన్ని గుర్తుచేసే ఇక్కడి పునర్నిర్మిత కట్టడాలను చూస్తుంటే మరో లోకంలో విహరిస్తున్నామా అనే భ్రమ కలగకమానదు. యాంపి థియేటర్, మహాస్తూపం, హారతి దేవాలయం, అశ్వమేథ యజ్ఞశాల, శ్రీచేత్యములు కనువిందు చేస్తాయి. ఆచార్య నాగార్జునుడు నిర్మించిన నాగార్జున విశ్వ విద్యాలయం, ఉపన్యాసశాల నమూనాలు కూడా ఇక్కడ ఉన్నాయి. వీటి వీక్షణలో సమయమే తెలియదంటే అతిశయోక్తి కాదు. బుద్ధ పూర్ణిమను ఇక్కడ మూడు రోజులపాటు ఓ పండుగలా జరుపుతారు. టిబెట్, నేపాల్ తదితర దేశాల నుంచి బౌద్ధ భిక్షువులు ఇక్కడికి వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

**మైమరపించే ఎత్తిపోతల..**

విజయపురిసౌత్‌కు 10 కి.మీ దూరంలో ఉన్న ఎత్తిపోతల ఒక అందమైన ప్రదేశం. కొండకోనల నుంచి వడివడిగా పయనించి 70 అడుగుల ఎత్తునుంచి జాలువారే జలధారను చూడడానికి రెండు కళ్లూ చాలవు. అలా దూకిన జలపాతం వంపు సొంపులు తిరుగుతూ కృష్ణమ్మ ఒడికి చేరుకుంటుంది. ఓవైపు జలపాత సవ్వడి, మరోవైపు చల్లని గాలులు.. ఇక్కడ గడిపిన క్షణాలు మర్చిపోవడం కష్టమే. ఇక్కడ విడిది చేసేందుకు టూరిజం శాఖ గెస్ట్‌హౌస్‌ను కూడా ఏర్పాటు చేసింది. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో శని, ఆదివారాల్లో సుగాలీల నృత్య ప్రదర్శన జరుగుతుంది. ఇటువంటి సుందర ప్రదేశాలను వీక్షిస్తే మైమరిచిపోక మానరు.

# మహిషాసుర మర్దిని నమోస్తుతే !

- భక్తి శ్రద్ధలతో విజయ దశమి
- వివిధ ఆలయాల్లో అమ్మవారికి విశేష పూజలు
- పాల్గొన్న ఆయా ప్రాంతాల ప్రజా ప్రతినిధులు
- నేటితో ముగియున్న దేవీ నవరాత్రుల ఉత్సవాలు


పెదకూరపాడులో అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే ప్రవీణ్ దంపతులు


అమరావతిలో మహిషాసురమర్దినిగా అమ్మవారి అలంకారం

అమరావతి, అక్టోబరు 11: దసరా శరన్నవరాత్ర మహోత్సవాలలో మహర్నవమి పర్వదినం రోజున బాలచాముండికా అమ్మవారిని మహిషాసుర మర్దినీ దేవిగా అలంకరించారు. ఉదయం ఆలయంలో నిత్యాపాసన, బలిహరణ కార్యక్రమాలతో పాటు కుంకుమపూజ, చండీహోమం నిర్వహించారు. బాలచాముండికా అమ్మవారితో పాటు ఆలయ మొదటి ప్రాకారంలోని జ్వాలాముఖి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి అమ్మవార్లను దర్శించుకున్న బక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

**క్రోసూరు :** క్రోసూరులో జరుగుతున్న దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా వాసవి అమ్మవారు మహానవమి పర్వదినం సందర్భంగా మహిషాసురమర్దిని దేవి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఆలయ పూజారి రాంబాబు శాస్త్రి అమ్మవారి అలంకారాన్ని విశేషంగా తీర్చిదిద్దారు. క్రోసూరుకు చెందిన మారం సీతారామయ్య అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మహానవమి కావటంతో తెల్లవారు జాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని సందర్శించారు.

**పెదకూరపాడు:** పెదకూరపాడు నియోజక వర్గం ప్రజలకు ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ విజయ దశమి శుభాకాంక్షలను శుక్రవారం తెలిపారు. మహాశక్తి ప్రతిరూపం ఐన దుర్గాదేవిని పూజించి ఆరాధించే విజయ దశమి పండుగను ప్రజలందరూ సంతోసంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

అలాగే నియోజక వర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. నియోజక వర్గ ప్రజలందరూ ఈ పండుగను సుఖ సంతోషాల నడుమ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

దసరా నవరాత్రులను పురస్కరించుకొని పలు గ్రామాల్లోని ఆయా ఆలయాల్లో మహిషాసుర మర్దనిగా అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. వచ్చినటువంటి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

**అచ్చంపేట:** అచ్చంపేటలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని కాళికా దేవిగా అలంకరించారు. ఆల దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూజారి గుంటూరు బలరామాచార్యులు, సురేష్ కుమార్ ఆచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆలయ కమిటీ సభ్యులు సూరె వీరవెంకటమణికంఠ, సూరె వెంకట సుబ్బా రావు, రామలింగ స్వామి, శేషగిరిరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

**బెల్లంకొండ:** బెల్లంకొండలోని మహాలక్ష్మిదేవి నిలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చక్రనవవరనార్చన విశేషంగా జరిగింది. తొమ్మిదవ రోజున మహాలక్ష్మిదేవి మహిషాసుర మర్దిని దేవి అలంకారంతో పూజలు అందుకున్నట్టు ఆగమ పండితులు పులుపుల వెంకట ఫణి కుమార్ శర్మ తెలిపారు. బెల్లంకొండ మండలంలోని పలు గ్రామాల దేవాలయాల వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ శివారులోని లక్ష్మి తిరుప తమ్మ తల్లి, గంగమ్మ, పోలేరమ్మ, అంకమ్మ దేవాలయాల వద్ద మహిళలు భారీ ఎత్తున తరలి వచ్చి బతకమ్మ వేడుకలను జరుపుకున్నారు. విజయ దశమి సందర్భంగా ఆలయాలకు ప్రత్యేక విద్యుత్ దీపాలంరణ చేశారు.

**సత్తెనపల్లి :** పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం కొనసాగాయి. వడ్డవల్లి బొడ్డు రాయి సెంటర్‌లో లలితా దేవి నవరాత్రుల కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దేవీ నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు పెద్దింటి భవ్యశ్రీ, ఎలినేడి లక్ష్మి తులసీ, ఉన్నవ ప్రమీలారాణి, మాధవి, లలితాదేవి, ప్రశాంతి, సరళ, శ్రీలక్ష్మి, లావణ్య, కావ్య తదితరులు పాల్గొన్నారు. సనారి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమంలో కొనసాగుతున్న ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని సందర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సత్తెనపల్లి నియోజక వర్గ ప్రజలకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు యర్రం వెంకటేశ్వరరెడ్డి, వైవీ ఆంజనేయులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయ భాస్కర్‌రెడ్డి, టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, నాగోతు శౌరయ్యలు శుక్రవారం ఒక ప్రకటనలో విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు. విజయాలకు చిహ్నమైన ఈ విజయ దశమి పండుగను ప్రజలు సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే కన్నా ఆకాంక్షించారు.

**నకరికల్లు :** దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కుంకలగుంటలో మహిషాసురమర్దనిగా భద్రకాళి అమ్మవారు, చేజర్లలో గంగా బ్రమరాంభ పార్వతి, నరసింగపాడులో అన్నపూర్ణ, గంగా అన్నపూర్ణ అమ్మవార్లు భక్తులకు దర్శన మిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో దేవాలయాల్లో పూజలు నిర్వహిస్తున్నారు. భజనలతో గ్రామాల్లో దసరా సందడి నెలకుంది. శనివారం దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు దేవాలయాన్నీ ముస్తాబయ్యాయి.

**డీజేలకు అనుమతి లేదు.. ఎస్ఐ సురేష్**

దసరా ఉత్సవాలను పురస్కరించుకొని బతుకమ్మలను ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో డీజేల ఏర్పాటు చేయరాదని ఎస్ఐ చల్లా సురేష్ కోరారు. గురువారం రాత్రి మండలంలోని కుంకలగుంటలో బతుకమ్మను ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో అక్కడ ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. డీజేలను పెట్టడానికి ఎలాంటి అనుమతి లేదని, పోలీసు శాఖకు ప్రజలు సహకరించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరించినట్లయితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**పిడుగురాళ్ల:** దేవీనవరాత్రులను పురస్కరించుకొని పట్టణంలోని పలు ఆలయాలలో అమ్మవారిని మహిషాసురమర్ధిని, ధనలక్ష్మి, పలురూపాలలో అలంకరించారు. స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారిని, కనకదుర్గ అమ్మవారిని మహిషాసురమర్ధినిగా, కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనలక్ష్మిగా అలంకరించారు. షిరిడీ సాయి, బ్రహ్మంగారి దేవాలయం, నాగులగుడి, గంగమ్మతల్లి దేవాలయంలో అమ్మవార్లను వివిధ రూపాలలో అలంకరించారు. పిడుగురాళ్ల బొడ్రాయి సెంటర్‌లోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద మహిళలు అధిక సంఖ్యలో హాజరై కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం లక్కీడీప్ ద్వారా ఎంపికైన మహిళలకు ముడెం పెద సత్యనారాయణ, గుండా అశోక్‌బాబు, తదితరులు బహుమతులు అందజేశారు.


కారంపూడిలో ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి, శోభారాణి దంపతులు

పట్టణంలోని షిరిడీ సాయి మందిరంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని బాబా పుణ్యతిథిని గుర్తుచేసుకుంటూ బాబా మూల విరాట్‌కు శ్రీపాద దర్శనం ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవాలయ అధ్యక్షులు శ్రీరాం వెంకట శ్రీనివాసరావు తెలిపారు. దసరా పండుగ రోజున మూలవిరాట్‌కు శ్రీపాద దర్శనం చేసుకొనే అవకాశం ఉదయం 8.30 గంటల నుండి ప్రారంభమవుతుందని శ్రీరాం శ్రీనివాసరావు తెలిపారు.

గురజాల నియోజకవర్గంలోని కార్మిక, కర్షక, అన్నివర్గాల ప్రజలకు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు ప్రతి పనిలో విజయం చేకూరాలని, పల్నాడు ప్రాంతంలోని రైతులు పాడిపంటలతో, వ్యాపారులు వ్యాపార అభివృద్ధితో సంతోషంగా వుండాలని యరపతినేని ఆకాంక్షించారు.

**మాచవరం :** దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా పలు గ్రామాల దేవాలయాల్లోని అమ్మవార్లను మహిషాసుర మర్దనిగా అలంకరించారు. చెన్నాయపాలెం రేణుకా దేవాలయంలో అమ్మవారిని, మాచవరంలోని చెన్నమల్లేశ్వర స్వామి దేవాలయంలోని అమ్మవారిని, మోర్జంపాడు శివారు బుగ్గమల్లేశ్వర స్వామి దేవాలయంలోని అమ్మవారిని, మాచవరంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో అమ్మవారిని మహిషాసుర మర్దనిగా అలంకరించారు. ఈ సందర్భంగా గ్రామ దేవాలయంలో అమ్మవార్లను నిమ్మకాయల దండలతో అలంకరించారు. చెన్నాయపాలెం గ్రామ పురోహితులు జానపాడు సీతారామ శర్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల దేవాలయాలను విద్యుత్ అలంకరించారు.

**దాచేపల్లి :** దేవీశరన్నవరాత్రులలో భాగంగా గత 9 రోజులుగా ఆలయాలలో జరుగుతున్న చండీహోమం నవరాత్రుల ముగింపుతో శుక్రవారంతో ముగిశాయి. ఆయాలలో పూజా కార్యక్రమాలలో వేదపండితులు మంత్రోచ్చరణ మధ్య స్వస్తివాచకాలతో ఆలయాలు మారుమోగాయి. అనంతరం వసంతోత్సవం, పూర్ణాహుతిని వైభవంగా నిర్వహించారు. దాచేపల్లిలోని వీర్లఅంకమ్మతల్లిని మహిషాసురమర్ధినిగా భక్తులకు దర్శన ఏర్పాట్లు గావించారు. దాచేపల్లిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**వాడవాడలా బతుకమ్మల ఏర్పాటు...**

దాచేపల్లిలో బతుకమ్మలను ఏర్పాటు చేసి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ సాంప్రదాయాలు పల్నాడులో విస్తారంగా కనిపిస్తాయి. వెంపలచెట్టును తీసుకొచ్చి పసుపు, కుంకుమలతో పూజించి పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ప్రతి నాలుగు లోగిళ్ల కలిసి ఓ ఇంటివద్ద బతుకమ్మను ఏర్పాటు చేసుకొని పూజలు నిర్వహించారు.

**కారంపూడి:** పట్టణంలో వేంచేసియున్న వీర్ల అంకాళమ్మ దసరా శరన్న వరాత్రుల్లో భాగంగా శుక్రవారం మహిషాసురమర్ధినిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు సాయిశర్మ 54 మంది దంపతులతో కుంకుమపూజ చేయించారు. అలాగే వాసవీ కన్యకా పరమేశ్వరి కాళికా మాతగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు మణికంఠశాస్త్రి పూఅ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చీతిరాల వెంకటకోటేశ్వరరావు ఉత్సవాలను పర్యవేక్షించారు. కాగా చెన్నకేశవస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారి విగ్రహం వద్ద అర్చకుడు కొమండూరి సత్యనారాయణచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి మహిషాసురమర్ధినిగా అలంకరించారు.

**మాచర్లటౌన్:** పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం మహిళలు బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ మహిళలు పూలతో బతుకమ్మను రూపొందించి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం బతుకమ్మ ఆట, పాటలతో అలరించారు.

**మాచర్ల రూరల్ :** దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని మండలంలోని విజయపురిసౌత్ మెయిన్ బజారు, సీట్రైవులోని కనకదుర్గ అమ్మవారి ఆలయాల వద్ద శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అమ్మవారు మహిషాసురమర్ధినిగా భక్తులకు దర్శనమిచ్చారు.

**కారంపూడి :** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శరవణ అపార్ట్‌మెంట్‌లో గురువారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి, శోభారాణి దంపతులు పాల్గొన్నారు. మహిళలు నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు కె ప్రసాదరావు ఆధ్వర్యాన ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాసుల శంకర్, ఆంజనేయులు, వెలుగూరి శ్రీనివాసరావు, నాయుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**దుర్గి:** మండల కేంద్రమైన దుర్గిలోని ముటుకూరు రోడ్డులో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారు శుక్రవారం మహిషాసుర మర్ధిని భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

**రెంటచింతల :** మండలంలోని వివిధ గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నయనానందకరంగా సాగుతున్నాయి. ఎటు చూసిన ఆధ్యాత్మిక ఉట్టిపడుతుంది. తొమ్మిదో రోజైన శుక్రవారం మహిషాసురమర్దినిగా భక్తులకు అభయమిచ్చారు. వాసవి కన్యకాపరమేశ్వరీ, జంక్షన్‌లోని శ్రీకనకదుర్గా,శ్రీ వెంకటేశ్వరస్వామి,శ్రీ చౌడేశ్వరీ,రామాలయం,ఉష్టస్తంభాల సెంటర్, సత్రశాలలోని గంగా భ్రమరాం ఆలయల్లో, పాత, కొత్త పాలువాయి, రెంటాల, తుమ్మకోట, మంచికల్లు తదితర గ్రామాల్లో వేదోక్తంగా కుంకుమార్చనలు చేశారు. లలితా సహస్రపారాయణం చేశారు. పూలతో అలంకరించిన బతకమ్మ ఆట భక్తుల్లో ఉత్సాహం నింపింది. జంక్షన్‌లో వరుసగా 28వ సంవత్సరం అన్నదానం చేపట్టారు. ఆయా ఆలయాల చైర్మన్లు కేవీ నాగేశ్వరరావు, ఏచూరి సాంబశివరావు, నాళం పెదబాబు, ఈవో రామిరెడ్డి దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.


బెల్లంకొండలో మహిషాసుర మర్దని దేవి అలంకారంలో మహాలక్ష్మిదేవి


చేజర్లలో మహిషాసురమర్దనిగా గంగా బ్రమరాంభ పార్వతి


చెన్నాయపాలెంలో మహిషాసుర మర్దనిగా రేణుకా అమ్మవారు


నారాయణపురంలో మహిషాసుర మర్దినిగా వీర్ల అంకమ్మతల్లి


మాచర్లలో బతుకమ్మల వద్ద మహిళలు వేడుకలు

# బట్టీల్లో బతుకు భారంగా..

- తెల్లారక ముందే సున్నంబట్టీల్లో తల్లిదండ్రులు పనులకు
- బడికి దూరమవుతున్న శ్రామిక బిడ్డలు
- పలు వ్యాధులతో తగ్గుతున్న ఆయుర్ధాయం
- కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం పట్టని యాజమాన్యం
- పనిలో మెజరీటీగా వలస కార్మికులే..

**రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలు వారివి. ఉదయం లేస్తే సున్నంబట్టీల్లో పనులకు వెళ్లాల్సిందే. వారితో పాటు పిల్లలను కూడా తీసుకెళ్లాల్సిందే. ఇది కొన్ని దశాబ్ధాలుగా పిడుగు రాళ్ల సున్నం బట్టీల వద్ద జరుగుతున్న తంతు. ఎన్ని చట్టాలు వచ్చినా.. కార్మికుల పిల్లల బతుకులను బాగుచేయలేక పోయాయి. సరైన వసతి లేక బడికి వెళ్లేందుకు స్థోమతలేక అనేక మంది చిన్నారుల జీవితాలు బట్టీల్లో బుగ్గి అవుతున్నాయి.**

పిడుగురాళ్ల, అక్టోబరు 11: దక్షిణ భారతదేశంలోనే సున్నం పరిశ్రమగా పేరొందిన పిడుగురాళ్లలో సున్నంబట్టీలు, వాటికి అనుబంధంగా సున్నం క్వారీలు విరివిగా వున్నాయి. సున్నం బట్టీలలో పనిచేసేందుకు కార్మికులు ఎక్కువ మంది సమీప జిల్లాల నుండి వలస వస్తుంటారు. మరికొందరు పిడుగురాళ్ల చుట్టుపక్కల గ్రామాల నుండి మరికొంతమంది రోజువారి కూలీలుగా సున్నం బట్టీల వద్ద పనిచేసేందుకు వస్తుంటారు. సున్నం బట్టీల వద్ద తెల్లవారుజామున 5 గంటల నుండే పని ప్రారంభమవుతుంది. బట్టీలో రాయి, బొగ్గును మెట్లు, లిఫ్ట్ ద్వారా లోడ్ చేయాలి, ఆ తరువాత బట్టీలోని కాల్చిన సున్నం, సున్నపురాళ్లను బయటకు తీసి ఐదు, పది, 25, 50 కేజీల బ్యాగ్‌లలో నింపి ఆపై లారీలకు లోడు చేయాల్సి వుంది. ఈ పనంతా ఉదయం 5 గంటల నుండి 11 గంటల లోపు పూర్తి చేయాల్సి వుంది. ఒక్కోసారి మధ్యాహ్నం వరకు కూడా పనిచేయాల్సి వస్తుంది. సున్నం బట్టీలో చేయాల్సిన పని ఏ రోజుకు ఆరోజు పూర్తి చేయాల్సి వుంది. మరునాడు చేసేందుకు వీలుపడదు. అటువంటి సమయంలో కార్మికులు సున్నపురాళ్లు, బట్టీ, బొగ్గు మధ్యనే ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పనిచేయాల్సి వుంది.



పిడుగురాళ్ల శివారులోని సున్నం బట్టీలు

**ఎన్నాళ్లైనా అంతేనా :** పిడుగురాళ్ల సమీపంలో వున్న సున్నం బట్టీలలో సమీప జిల్లాల నుండి వలస వచ్చిన కూలీల పిల్లలు విద్య, వైద్యానికి దూరమవుతున్నారు. తల్లిదండ్రులు ఏమో పొద్దున్నే పనికి వెళ్తే మధ్యాహ్నం వరకు పనిచేస్తేనే పూటగడిచేది. వారి పిల్లల ఆలనా పాలనా చూసుకునే వారు ఇంటివద్ద ఎవరూ లేకపోవడంతో తల్లిదండ్రులు పనిచేసే ప్రదేశం వద్దకే తమ పిల్లలను కూడా వెంటబెట్టుకొని రావాల్సి వస్తుంది. బడి వయసు వున్న పిల్లలు కూడా కొందరు బడికి వెళ్లేందుకు వీలులేక పని ప్రదేశంలోనే వుండాల్సి వస్తుంది. చిన్నారుల ఆలనా పాలనా చూసుకునేందుకు తమకంటే పెద్దదైన అన్న, అక్కల సాయంతోనే చిన్నారి మంచిచెడ్డలు గడిచిపోతుంటాయి. ఇలాంటి సమయంలో బడి వయసు వున్న పిల్లలు కూడా విద్యకు దూరమవుతున్నారు. అంతే కాకుండా వారికి ఏ చిన్నపాటి సుస్తి చేసినా ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లే స్థోమత లేక



సున్నం బట్టీ వద్ద పని ప్రదేశంలోనే చిన్నారులు

చిన్నారులు మొదటి దశలోనే అనేక రుగ్మతలకు దగ్గరవు తున్నారు. సున్నంబట్టీల నుండి వెలువడే కార్బన్ డైఆక్సైడ్, వివిధ రకాల కాలుష్యంతో చిన్నారులు నుండి పెద్దలు వరకు ఊపిరితిత్తుల వ్యాధులతోనే అస్వస్థతకు గురై ప్రాణాలు పోగొట్టుకున్నవారు ఎందరో వున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి సున్నంబట్టీలలో పనిచేసే కార్మికుల స్థితిగతులను పరిగణనలోకి తీసుకొని వారి పిల్లల భవిష్యత్‌కై బడికి దూరంగా వున్న వారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించాల్సిన అవసరం ఎంతైనా వుంది.



**ఆయుష్షు తగ్గింపే :** మనిషి సగటు జీవితం 70 సంవత్సరాలు వున్నా సున్నంబట్టీలలో పని చేసే వారిలో ఎక్కువ మంది 40 ఏళ్లు దాటితేనే ముసలితనం కనిపిస్తుంది. అప్పటికే పళ్లు ఊడి పోయి జుట్టు రాలి మోకాళ్ల నొప్పులతో, ఊపిరి తిత్తుల సమస్యలతో ఇబ్బంది పడేవారు దాదాపు 90శాతం మంది వున్నారు. ఓ మనిషి మిగిలిన పనులు చేసుకుంటూ వుంటే ఆయురార్ధం 70ఏళ్లు అను కుంటే సున్నంబట్టీలలో పనిచేసే వారి ఆయుష్షు సగానికి పడిపోతుంది.

**ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే :**

పొద్దస్తమానం కష్టపడ్డా వారి ఆర్థిక పరిస్థితుల్లో పెద్దగా మార్పు ఏమీ కనిపించదు. కూలీ రేట్లు ప్రతి ఏటా పెరుగుతున్నప్పటికీ ఇంటి ఖర్చులు, నిత్యావసర సరుకులు కూడా అంతకన్నా రెట్టింపుధరలో పెరిగిపోతుండటంతో ఎంత కాయకష్టం చేసినా వారికొచ్చే సంపాదన పూట గడవడానికే సరిపోతుంది. బట్టీలలో పనిచేసే కార్మికులు వుంటున్న గృహాలు కూడా సున్నంరాళ్లు, బొగ్గు దిబ్బలమధ్యే వుంటున్నాయి. పెద్దలతో పాటే పిల్లలు అక్కడే నివశించాల్సి వుండటంతో చిన్నతనం నుండే అనారోగ్య సమస్యలు చిన్నారులకు వెంటాడుతుంటాయి.

పట్టణంలో ఇఎస్ఐకి అనుబంధంగా వున్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చిన్న చితక వైద్యం చేయించుకుంటారే తప్ప పెద్ద అనారోగ్య సమస్యలు తలెత్తితే ప్రైవేటు వైద్యశాలకు వెళ్లే స్థోమత లేక ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగినంత సౌకర్యాలు లేకపోవడంతో గత్యంతరంలేని పరిస్థితుల్లో ప్రభుత్వ వైద్యశాలలో ఇచ్చే మందు బిళ్లలతోనే సరిపుచ్చుకుంటూ ఒక్కోసారి ప్రాణాలమీదకు తెచ్చుకొని పోగొట్టుకున్నవారు వున్నారు. లెనిన్‌నగర్, మారుతీనగర్, చంద్రపాలెం ప్రాంతాలలో నివశించే 90 శాతం మంది బయటి ప్రాంతాల వలస కూలీలే. వీరిలో ఎక్కువ మంది తాము పనిచేసే సున్నంబట్టీల వద్దనే చిన్న గదిలో కాపురం వుండాల్సి వస్తుంది.

**పనిలో ఇద్దరూ సమానమే :** ఎక్కడైనా, ఏ వృత్తిలోనైనా కాస్త పురుషులే ఎక్కువ సమయం కష్టపడుతుంటారు. కానీ పల్నాడులోని పిడుగురాళ్ల సమీపంలో వున్న సున్నంబట్టీల వద్ద పనిచేసేవారిలో పురుషులు, స్త్రీలు వుంటారు. వీరిలో ఇద్దరూ సమానంగా పనిచేస్తేనే ఆరోజు పూటగడిచేది. ఓ మాట చెప్పాలంటే ఇక్కడ పురుషుల కన్నా స్త్రీలే ఎక్కువగా కష్టపడి కుటుంబ ఆదాయానికి చేదోడు వాదోడుగా వుంటుంటారు.

**బడికి రావాలని కోరుతున్నాం : హెచ్‌ఎం నాగేశ్వరరావు**

సున్నంబట్టీల ప్రాంతంలో కూలీలుగా వుండే వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని, వారంలో రెండు రోజులు వారుండే నివాస గృహాల వద్దకు వెళ్తుంటాము. కొందరేమో మేము చెప్పిన వెంటనే ఒకటి, రెండు రోజులు పాఠశాలకు పంపి తరువాత ఇంటివద్దనే మరికొంత మంది పిల్లల ఆలనా పాలనా చూసుకునేందుకు ఇంటి వద్దనే గడపాల్సి వస్తుంది. మిగిలిన ప్రాంతాల పాఠశాలలకు వచ్చే వారి సంఖ్యతో పోలిస్తే సున్నంబట్టీలలో పనిచేసే కార్మికుల పిల్లల హాజరు గణనీయంగా తగ్గింపే వుంటుంది. వారి స్థితిగతులను చూసి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే చిన్నారులకు దుస్తులు, పుస్తకాలను ఉచితంగా అందిస్తున్నా పాఠశాలకు వచ్చిన రోజు భోజనం కూడా అందజేయడం జరుగుతుంది.



## 14న మద్యం దుకాణాలకు లాటరీ

- స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఏసీ సుధాకరరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ రవి కుమార్‌రెడ్డి వెల్లడి
- పెదకూరపాడులో మద్యం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం పరిశీలన

పెదకూరపాడు, అక్టోబరు 11 : మద్యం దుకాణాలకు టెండర్లు దాఖలు చేసిన వారందరికీ లాటరీ పద్ధతి ద్వారా ఈనెల 14వ తేదీన డ్రా తీయటం జరుగుతుందని స్టేట్ టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ సుధాకరరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ రవి కుమార్‌రెడ్డిలు తెలిపారు. నియోజక వర్గ కేంద్రమైన పెదకూరపాడు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను శుక్రవారం వారు సందర్శించి మద్యం దుకాణాల టెండర్ల విధానాన్ని పరిశీలించారు. పెదకూరపాడు, అమరావతి మండలాలకు సంబంధించి పది మద్యం దుకాణాలకు ఎంత మంది టెండర్లు దాఖలు చేశారో ఆయా మండాలకు కేటాయించిన నెంబర్ల వారీగా వివరాలను సీఐ శ్రీనివాసులను అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్‌లో వచ్చే దరఖాస్తులను కూడా పరిశీలిస్తామని, 14వ తేదీన జిల్లా కేంద్రంలో కలెక్టర్ ద్వారా లాటరీలో విజేతలను ప్రకటిస్తారని, 16వ తేదీ నుంచి మద్యం షాపులను ప్రారంభించు కోవచ్చని, అప్పటి వరకు ప్రభుత్వ దుకాణాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఆ రోజు నుంచి నూతన మద్యం విధానం అమల్లోకి వస్తుందని, టెండర్లు దాఖలుచేసినవారి ఎంపిక పారదర్శకంగానే ఉంటాయని, ఎటువంటి ప్రలోభాలు ఉండవని వారు వివరించారు. టెండర్లు దాఖలు చేసిన వారెవ్వరూ ఎటువంటి అపోహలను పట్టించు కోవద్దన్నారు. గతంలో మద్యం అమ్మకాల పై కమిషనర్ 12 శాతం ఉండేదని, ఈ నూతన విధానం 25 శాతం ప్రభుత్వం పెంచిందని వారు



మాట్లాడుతున్న స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఏసీ సుధాకరరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ రవి కుమార్‌రెడ్డి తదితరులు

వివరించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీ సూర్యనారాయణ, సీఐ వీ.శ్రీనివాసులు, పల్నాడు, గుంటూరు జిల్లాలోని పలు ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

**రెండు రోజుల్లో పెరిగిన దరఖాస్తులు**

ఈనెల 1వ తేదీ నుంచి మద్యం దుకాణాలకు ప్రభుత్వం దరఖాస్తులకు పెంచిన జిల్లాలోని పలు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ల పరిధిల్లో మద్యం దుకాణాలకు దరఖాస్తులు పెట్టేందుకు ముందుకు రాలేదు. పలు నియోజక వర్గాల్లో ఆయా ప్రజా ప్రతినిధులకు వాటాలు ఇవ్వాలనే ఊహాగానాలతో దరఖాస్తు దారులు ముందుకు రాలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రలు పత్రికా ముఖంగా ఈ విషయం పై ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని, ఎటువంటి రాజకీయ ప్రమేయాలు ఉండవని ప్రకటించటంతో మద్యం దుకాణాలకు టెండర్లు వేసేందుకు ముందుకు వచ్చారు. పెదకూరపాడు నియోజక వర్గంలోని పెదకూరపాడు, క్రోసూరులలో ఐదు మండలాలకు సంబంధించి పెదకూరపాడులో ఐదు మద్యం దుకాణాలు, అమరావతిలో ఐదు మద్యం దుకాణాలు, క్రోసూరు మండలంలో నాలుగు మద్యం దుకాణాలు, అచ్చంపేట మండలంలో నాలుగు మద్యం దుకాణాలు, బెల్లంకొండ మండలంలో రెండు మద్యం దుకాణాలకు సంబంధించి ప్రభుత్వం దరఖాస్తు కోరింది. పెదకూరపాడు, క్రోసూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ల పరిధిలో అమరావతి మండలంలోని 5 షాపులకు 145 దరఖాస్తులు, పెదకూరపాడు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో 5 షాపులకు గాను 105 దరఖాస్తులు, క్రోసూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలో 10 షాపులకు గాను 317 దరఖాస్తులు, అచ్చంపేట మండలంలోని 76వ నంబరు షాపునకు 36 దరఖాస్తులు, అమరావతి మండలంలోని 129వ షాపునకు 33 దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా దరఖాస్తుల రూపేణా ప్రభుత్వానికి రూ.11 కోట్ల 3 లక్షల 46 వేలు ఆదాయం సమకూరింది.



## జగన్‌రెడ్డికి ప్రగల్భాలు తగ్గలేదు

- చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, అక్టోబరు 11: గడిచిన ఎన్నికల్లో ప్రజలు పాతాళానికి పడవేసినా జగన్ ప్రగల్భాలు మాత్రం తగ్గలేదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని ఇర్లపాడు గ్రామ పరిధిలోని కేంద్రీయ విద్యాలయం నుంచి హెచ్‌బీఎల్ కంపెనీ వరకు రూ. 40 లక్షల ఉపాధి హామీ నిధులతో ఏర్పాటు చేయనున్న మెటల్ రోడ్డుకు పుల్లారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నాలుగు నెలల పాలనపై మాజీ ముఖ్యమంత్రి జగన్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఎద్దేవా చేశారు. ఐదు సంవత్సరాల పాలనలో గుంతలు పడిన, ధ్వంసమైన రోడ్లే సాక్ష్యమని చురకలు వేశారు. ఇదేనా? ప్రజలకు జగన్ చేసిన మేలని విమర్శించారు. గతంలో ఏ ప్రభుత్వం ఉన్నా రోడ్ల నిర్వహణ, నిర్మాణం, విస్తరణకు కనీస నిధులు కేటాయించేవారని, వాటిని కూడా మంగళం పాడిన ఘనుడు జగన్‌రెడ్డి అన్నారు. ఉపాధి హామీ, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో వాటన్నింటికీ పరిష్కారం చూపించాల్సి ఉందన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న పల్లె పండుగ కార్యక్రమంలో గ్రామీణ సమస్యలు తీర్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, ఎంపీడీవో స్వరూపరాణి, సర్పంచ్ కోటేశ్వరమ్మ, పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, ఏఈ వెంకటేశ్వరరావు, నాయకులు ఆలూరి రమణయ్య, నాగేశ్వరరావు, నాగ పూర్ణచంద్రరరావు, జయ ప్రసాదు, సురేష్, ఉపేంద్ర, రాఘవయ్య, గట్టినేని రమేష్, నెల్లూరి హరిబాబు పాల్గొన్నారు.



మెటల్ రోడ్డు శిలఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

## 17 మద్యం దుకాణాలకు 188 దరఖాస్తులు

చిలకలూరిపేట, అక్టోబరు 11: చిలకలూరిపేట నియోజకవర్గంలో మద్యం దుకాణాలకు శుక్రవారం గడువు ముగిసే సమయానికి 27దుకాణాలకు సగటున 11 చొప్పున దరఖాస్తులు దాఖలయ్యాయి. నాన్ రిఫండబుల్ దరఖాస్తు ఫీజు కింద ఒక్కొక్క దుకాణానికి రూ.2 లక్షలు చొప్పున మొత్తం రూ.3.76 కోట్లు ప్రభుత్వానికి ఆదాయంగా లభించింది. నియోజకవర్గం పరిధిలో మొత్తం 17 మద్యం దుకాణాలకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. శుక్రవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో సేకరించిన సమాచారం ప్రకారం మొత్తం 17 దుకాణాలకు 188 దరఖాస్తులు దాఖలు అయ్యాయి. పట్టణంలో 6, చిలకలూరిపేట మండలంలో 3, యడ్లపాడు మండలంలో 3, నాదెండ్ల మండలంలో 5 చొప్పున దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. గతంలో నాదెండ్ల మండలంలో 3 మద్యం దుకాణాలు ఉండగా ఈసారి మరో 2 పెరిగి ఈ సంఖ్య 5కు చేరింది.



## ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

సత్తెనపల్లి,అక్టోబరు11: అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని 11వ వార్డులో ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు కిషోర బాలికలు ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ఏసిడిపీవో సంతోషమ్మ, సూపర్వైజర్ అరుణ మాట్లాడుతూ ఉన్నత విద్యలో అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత శఖరాలను అధిరోహించాలన్నారు. చదువులో రాణించి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలన్నారు. బాలికలను చదివిద్దాం...భవిష్యత్‌ను ఇద్దామంటూ నినాదాలు చేశారు. సుకన్య సమృద్ది పథకం గురించి వివరించారు. బాల్య వివాహలు చట్టరీత్యా నేరమన్నారు.



బాలిక దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ



## అక్రాన్ ఫార్మాలో విజయ దశమి వేడుకలు

ముప్పాళ్ళ, అక్టోబరు11: అక్రాన్ ఫార్మా కంపెనీలో విజయ దశమి కంపెనీ ఉద్యోగులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులకు శుక్రవారం కంపెనీ ప్లాంట్ హెడ్ రసూల్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ గనపాల విమల్‌రాజు, లీగల్ అడ్వయిజర్ దాడి వెంకటేశ్వర్లు బహుమతులను అందజేశారు. మహిళలకు లెమన్ అండ్ స్పూన్, క్లిప్పింగ్, మ్యాజిక్ చైర్ వంటి పోటీలు, యువకులకు క్రికెట్, షటిల్, ఫుట్‌బాల్ వంటి పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుతులు అందజేశారు. నవరాత్రుల సందర్భంగా కంపెనీలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో కంపెనీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## వైరల్ జ్వరాలపై వైద్య శిబిరం

బొల్లాపల్లి, అక్టోబరు 11: మండలంలోని పలు గ్రామాల్లో ప్రబలిన వైరల్ జ్వరాలపై శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. కారంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్యాధికారి డాక్టర్ ఎం.రమ్య ఆధ్వర్యంలో జిల్లా మెడికల్ అధికారి వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశాలమేరకు లాలీపురం, రాజానాయక్‌తండా, హనుమాపురం గ్రామాల్లో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటికి సర్వే నిర్వహించి డెంగీ, సీజనల్ జ్వరాలు రాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

## మంత్రులతో ఎమ్మెల్యే అరవిందబాబు భేటీ

### పలు సమస్యలపై వినతులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 11: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని ఆయన చాంబర్‌లో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. పల్నాడు జిల్లాతో పాటు డివిజన్ కేంద్రమైన నరసరావుపేట నియోజకవర్గానికి సంబంధించి అభివృద్ధి కార్యక్రమాలను చర్చించారు. పలు గ్రామాలకు వెళ్ళే మార్గాలలో చప్టాలు ఉన్నాయని, భారీ వర్షాలు, వాగులు పొంగే సమయాలలో చప్టాలు ప్రమాదకరంగా మారాయన్నారు. చప్టాలుగా ఉన్న వాటిని హైలెవల్ బ్రిడ్జిలుగా మార్చేందుకు నిధులు కేటాయించాలన్నారు. వైసీపీ పాలనలో రోడ్లను పట్టించుకోలేదన్నారు. నరరావుపేట పురపాలక సంఘం పరిధిలోనూ పలు వార్డులు, ప్రధాన రహదారులలో సైతం బ్రిడ్జిలు అవసరం ఎంతో ఉందన్నారు. అదేవిధంగా రహదారుల అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. జిల్లా కేంద్రం కావడంతో రాష్ట్ర స్థాయి అధికారులు, మంత్రులు వివిధ కార్యక్రమాలలో పాల్గొనేందుకు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్ల విస్తరణ అవసరమైందన్నారు. మల్లమ్మ సెంటర్ వంటి ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఫ్లై ఓవర్ ఏర్పాటు అత్యవసరం అన్నారు. రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించి, తమ ప్రతిపాదనలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కాగా అనంతరం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిశారు. నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో చేపట్టవలసిన అభివృద్ధి పనులను మంత్రికి వివరించారు. కేర్ యూనిట్ లెవెల్ వన్ శంకుస్థాపనకు రావాలని ఆహ్వానించారు. నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని మంత్రిని కోరారు. ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని మంత్రి సత్యకుమార్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, లక్కీరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వేల్పుల సింహాద్రియాదవ్, కనుమూరి లక్ష్మి, వాసిరెడ్డి రవి, వనమా శివ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, కపలవాయి విజయకుమార్ తదితరులు



రోడ్లు, భవనాల శాఖ మంత్రి జనార్ధనరెడ్డితో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

## రైల్వే స్టేషన్‌కు రావాలంటేనే భయం.. భయం..

● ఆకతాయిలకు అడ్డాగా వినుకొండ స్టేషన్ పరిసరాలు



పొదలు, రైల్వే సామగ్రితో ఉన్న రైల్వే స్టేషన్ ఆవరణ





గోతులమయంగా ఉన్న వినుకొండ రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి

వినుకొండ టౌన్, అక్టోబరు 11: రైల్వే స్టేషన్‌కు రావాలంటే ప్రయాణికులు వణికిపోతున్నారు. దొంగల తాకిడికి మహిళలు భయాందోళనలు చెందుతున్నారు. రైల్వే స్టేషన్ నుంచి ఏనుగుపాలెం వెళ్లే రోడ్డులో ప్రయాణికులకు భద్రత కరువైంది. ఇటీవల రైల్వే గుత్తేదారులు ఏర్పాటుచేసిన పెద్ద పెద్ద కాంక్రీట్ దిమ్మల తయారీ ప్రాంతంలో ఏపుగా పెరిగినచెట్ల మధ్య హిజ్రాలు, ఆకతాయిలు మద్యం, గంజాయి మత్తులో దాడులకు పాల్పడడం పరిపాటిగా మారింది. ఇటీవల కాలంలో ప్రకాశం జిల్లాకు చెందిన ఇద్దరు రైలు దిగి వస్తుండగా, వారిపై ఆకతాయిలు దాడిచేసి చేతిలో బ్యాగ్‌తోపాటు, సెల్ ఫోన్ తస్కరించి పరారైయ్యారు. ఇదిలా ఉండగా స్టేషన్ పరిధిలో సీసీ కెమేరాలు పని చేయకపోవడంతో ఇదే అదునుగా భావించి దొంగలు ప్రయాణికుల నుంచి విలువైన వస్తువులతో పాటు, సెల్‌ఫోన్ దొంగతనాలు పెరిగాయి. నరసరావుపేట వైపు ప్లాట్‌ఫారంపై గంజాయి బ్యాచ్ ఆగడాలు పెరిగిపోయినప్పటికీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో అడవిని తలపించే చెట్ల కారణంగా దొంగలు తప్పించుకునేందుకు అనువుగా మారింది.

### అధ్వానంగా రహదారి

ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా వాహనాల రాపోకల కారణంగా రోడ్లు పూర్తిగా దెబ్బతిని ప్రయాణికులు రైల్వే స్టేషన్ రావాలంటే తీవ్ర ఇబ్బందులు గురౌతున్నారు. ఏనుగుపాలెం రైల్వే గేట్ సమీపంలో గత కొంతకాలంగా రైల్వే గుత్తేదారులు వాహనాల కారణంగా రోడ్లు పూర్తిగా ధ్వంసమై రాక పోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైల్వే రోడ్లు ఆధునికీకరించి, ప్రయాణికులకు భద్రత కల్పించి, స్టేషన్ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటుచేసి హిజ్రాలు, గంజాయి బ్యాచ్, దొంగల బారినుంచి భద్రత కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## మద్యం షాపులకు 526 దరఖాస్తులు

వినుకొండ టౌన్, అక్టోబరు 11: రాష్ట్ర వ్యాప్తంగా మద్యం షాపులకు ఈ నెల 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు వినుకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 14షాపులకు 338 దరఖాస్తులు దాఖలైనట్లు ఎక్సైజ్ సీఐ దేవర శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. వినుకొండ పట్టణంలో 6షాపులకు 162, వినుకొండ రూరల్ రెండు షాపులకు 63, నూజండ్ల మూడు షాపులకు 50, శావల్యాపురం మండలంలో రెండు షాపులకు 63మంది దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం షాపులకు ప్రభుత్వానికి 6.75 కోట్లు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా ఈపూరు మండలంలో 112, బొల్లాపల్లి 76 దరఖాస్తు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

### బొల్లాపల్లి మండలంలో 112 దరఖాస్తులు

బొల్లాపల్లి, అక్టోబరు 11: మండలంలోని మూడు బెల్టు షాపులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం విధానంలో భాగంగా పల్నాడు జిల్లా ఈపూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బొల్లాపల్లి మండలంలోని వెల్లటూరు, బొల్లాపల్లి, రేమిడిచర్ల గ్రామాలకు సంబంధించి మూడు మద్యం దుకాణాలకు 112 దరఖాస్తులు వచ్చాయని, ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డీ వెంకటేశ్వర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్ కే శ్రీనివాసులు తెలిపారు.



అనారోగ్యంతో మృతిచెందిన పాలడుగు వెంకయ్య కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు, మాజీ సర్పంచి బోడెపూడి ప్రసాద్, టీడీపీ నాయకులు

## కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

శావల్యాపురం, అక్టోబరు 11: శావల్యాపురం మండలంలోని కనమర్లపూడి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పాలడుగు వెంకయ్య అనారోగ్యంతో మృతిచెందగా గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రఘాడ సానుభూతి తెలియచేశారు. కనమర్లపూడి మాజీ సర్పంచి, టీడీపీ మాజీ అధ్యక్షులు బొడెపూడి ప్రసాద్ తన సొంతనిధులతో రూ 20 వేలు ఆర్థిక సాయం అందచేశారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా టీడీపీ రైతు సంఘం ఉపాధ్యక్షులు గోరంట్ల హనుమంతరావు, బొడెపూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో గుంటూరులో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం

● కొలనుకొండలో కియా షోరూమ్ ప్రారంభోత్సవంలో మంత్రి లోకేశ్


తాడేపల్లి, అక్టోబరు 11: గుంటూరులో ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణాన్ని అతి త్వరలోనే చేపడతామని, అన్ని పద్ధతి ప్రకారమే చేస్తామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కొలనుకొండ బైపాస్ రోడ్డు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సింహా కియా షోరూమ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. మంగళగిరిలో ఎయిమ్స్‌కు నీటి సరఫరాతోపాటు 100 పడకల ఆసుపత్రి నిర్మాణం త్వరలో చేపడతామని, మూడు నెలల్లో మంగళగిరిలో భూగర్భ డ్రెయినేజీ పనులు చేపడతామని తెలిపారు. దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వారికి పట్టాలు ఇస్తామని, పార్టీలో కష్టపడిన వారికి నామినేటెడ్ పోస్టులు ఇస్తామని వివరించారు. రోడ్ల నిర్మాణం కూడా త్వరలోనే చేపడతామని, ఐదేళ్లలో రోడ్లను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ఫేక్ న్యూస్ ప్రచారంపై కఠిన చర్యలు తప్పవని, వరద సాయంపై వైసీపీ దుష్ప్రచారం చేస్తుందని అన్నారు. దాదాపు పది రోజులకు పైగా సీఎం చంద్రబాబు నాయుడు మంత్రివర్గం మొత్తం ముంపు ప్రాంత పనులను పర్యవేక్షించారని, ఆనాడు వైసీపీ ఎక్కడుందని ప్రశ్నించారు. వరద బాధితులను ఆదుకునేందుకు కోటి సాయం ప్రకటించిన జగన్ రెడ్డి ఎక్కడ ఖర్చు పెట్టాడో చెప్పాలన్నారు. సుమారు రూ.650 కోట్లకు పైగా ఖర్చు పెట్టామని, ఏమైనా లోటుపాట్లు ఉంటే సాయం అందకపోతే వివరాలు ఇవ్వాలని లోకేశ్ అన్నారు. వైసీపీ మాదిరిగా మేము పరదాలు కట్టుకుని తిరగడం లేదనీ, వరదలు వస్తే జగన్ కనీసం తాడేపల్లి ప్యాలెస్ గేటు దాటలేదన్నారు. రాయలసీమకు మ్యానిఫ్యాక్చరింగ్ యూనిట్లు, సర్వీసింగ్‌లను ఉత్తరాంధ్రకు తీసుకువస్తామన్నారు. విండ్, సోలార్, పంప్ స్టోరేజి ప్రాజెక్టులు, సిమెంటు ఫ్యాక్టరీలు కర్నూలుకు, ఎలక్ట్రానిక్ మ్యానిఫ్యాక్చరింగ్ కంపెనీలు కడప, చిత్తూరుకు, ఆటోమొబైల్స్ అనంతపురంకు, ఉభయగోదావరికి ఆక్వా, పెట్రో కెమికల్ పరిశ్రమలు కృష్ణా, గుంటూరుకు తీసుకువచ్చి అభివృద్ధి వికేంద్రీకరణకు కట్టుబడి ఉన్నామన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ఎన్ని కంపెనీలు తీసుకువచ్చారు, ఎన్ని ఉద్యోగాలు కల్పించారో బహిర్గతం చేయాలన్నారు. బుక్‌ల విషయంలో వైసీపీ నన్ను చూసి ఇన్‌స్పైర్ అయినట్టుందని బ్లూ బుక్, గుడ్ బుక్ అంటుందన్నారు.



వేదికపై మంత్రులు లోకేశ్, పార్థసారథి, రామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు

### అట్టహాసంగా కియా కార్ల షోరూమ్ ప్రారంభం

తాడేపల్లి బైపాస్ రోడ్ కొలనుకొండలో సుమారు 2.5 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కియా కార్ల షోరూమ్‌ను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. ఇక్కడ కియా కార్ల పూర్తి శ్రేణి విక్రయాలతోపాటు అత్యంత అధునాతన పరికరాలతో రోజుకు 50 కార్ల వరకు సర్వీస్ అందించగల విశాలమైన సర్వీస్ సెంటర్ కూడా ఏర్పాటు చేశారు.




## శారీరక, మానసిక ఆరోగ్యంతో సంపూర్ణ ఆరోగ్యం

● మానసిక వైద్య నిపుణుడు సురేష్‌కుమార్

గుంటూరు, అక్టోబరు 11: శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం బాగుంటేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని మానసిక వైద్య నిపుణుడు కె.సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నేటి పరుగుల జీవనంలో పాఠశాలకు వెళ్ళే చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరు మానసిక ఒత్తిళ్ళకు గురవుతున్నారన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దెబ్బతిని ఓదార్చే పెద్ద దిక్కులేక నేడు చిన్న సమస్యలకే యువత ఆత్మన్యూనతతో మానసిక సమస్యలకు గురవుతున్నారని అన్నారు. మానసిక ఒత్తిడిలో ఉన్న వ్యక్తుల్లో కోపం, చిరాకు, భయం, దిగులు, నిద్రలేమి ఉంటాయన్నారు. వీటికి తగిన చికిత్సలు పొందకుంటే క్రమేపీ శారీరక రుగ్మతలుగా మారతాయన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, వీవీ రావ్, డాక్టర్ రవీంద్రకుమార్, రామకృష్ణారెడ్డి, అచ్యుత ఇందుశేఖర్ తదితరులున్నారు.








బాలిక దినోత్సవంలో పాల్గొన్న బాలికలు, నిర్వాహకులు

## పసుమర్రులో అంతర్జాతీయ బాలిక దినోత్సవం

చిలకలూరిపేట అక్టోబరు 11: చిలకలూరిపేట మండలం పసుమర్రులో శుక్రవారం స్థానిక జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని నిర్వహించారు. మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ దాసరి చిట్టిబాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి జనవిజ్ఞాన వేదిక సమత విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షురాలు టి.కుమారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతికి గౌరవ తెచ్చేది బాలికలే అన్నారు. ప్రస్తుత పరిస్థితులలో బాలికలు చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. గుడ్ టచ్, బాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పెద్దలు, గురువులు చెప్పే మాటలు విని అనుసరించాలని అన్నారు. లేనిపక్షంలో ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుందని చెప్పారు. ఆడపిల్లలుగా పుట్టడం అదృష్టం అని అన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థునులకు ఎదిగే ఆడపిల్ల ఏమి తెలుసుకోవాలి అనే పుస్తకాన్ని బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి దార్ల బుజ్జిబాబు, సొసైటీ ఉపాధ్యక్షులు గేరా యాకోబు, కార్యదర్శి పొనుగుబాటి బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.


నూజెండ్లలో బురదమయంగా మారిన రోడ్డు

## చినుకుపడితే చిత్తడే

● ఇక్కట్లు పడుతున్నగ్రామస్థులు

నూజెండ్ల, అక్టోబరు 11: మండలంలోని గత మూడు రోజులుగా పడుతున్న వర్షాలతో డ్రెయినేజ్ వ్యవస్థ సక్రమంగా లేని గ్రామాల్లో రోడ్లు బురద, నీటిమయంగా మారాయి. ముఖ్యంగా మండల కేంద్రం నూజెండ్లలో గతంలో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం ద్వారా నిర్మించిన రోడ్లు పాడై పోవటంతో రెండు సంవత్సరాల క్రితం మట్టి తోలించి సీసీ రోడ్లు నిర్మాణం చేయకపోవటంతో పాదచారులకు ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలో ఇతర గ్రామాలకు వెళ్ళేవారికి కూడా వాహనాలు మట్టిలో కూరుకుపోయి ఇబ్బంది పడుతున్నారు. నూజెండ్ల టూ నూజెండ్ల రింగ్ రోడ్డు పునఃర్నిర్మాణంలో భాగంగా నూజెండ్ల సీసీ రోడ్డు నిర్మాణం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.




### పట్టభద్రుల ఓటు హక్కు నమోదు కేంద్రం ప్రారంభం

వినుకొండటౌన్, అక్టోబరు 11: స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో కృష్ణా- గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఓటర్ నమోదు కేంద్రాని యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు ఎ.నాగేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఓటు నమోదుకు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు, ఓటర్ కార్డు, డిగ్రీ పట్టా, పాస్‌ఫొటోతో కార్యాలయంలో ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రవిబాబు, ఆర్ అజయ్‌కుమార్, ఆడిట్ కమిటీ సభ్యులు పీఏ జిలానీ, సీనియర్ నాయకులు డీవీ లింగయ్య, రామిరెడ్డి, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

### ఈపూరు సర్కిల్‌లో మద్యం షాపులకు 238 దరఖాస్తులు

ఈపూరు, అక్టోబరు 11: ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలోని 9 మద్యం షాపుల నిర్వహణ అనుమతి కోసం 238 దరఖాస్తులు అందినట్లు సీఐ డీ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కే శ్రీనివాసరావులు శుక్రవారం తెలిపారు. రొంపిచర్ల మండలంలో నాలుగు షాపులకు 50, బొల్లాపల్లి మండలంలో మూడు షాపులకు 112, ఈపూరు మండలంలో రెండు షాపులకు 76 దరఖాస్తులు అందినట్లు సీఐ తెలిపారు.






# వైభవంగా దసరా ఉత్సవాలు





శావల్యాపురం, గంటావారిపాలెంలో మహిషాసురమర్ధిని అలంకారంలో శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారు

కిటకిటలాడిన దేవాలయాలు



వినుకొండలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు



దేవీ శరన్నరాత్రుల్లో భాగంగా వినుకొండ బోస్ బొమ్మ సెంటర్‌లో నగరోత్సవంలో పాల్గొన్న అమ్మవారి భక్తులు

వినుకొండ, అక్టోబరు 11: మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలోని శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దేవీ నవరాత్రులు తొమ్మిదో రోజు సందర్భంగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి దంపతులు పాల్గొని అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హిమాలయ గురూజీ ఎమ్మెల్యే దంపతులకు పట్టు వస్త్రాలు అందించి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చిన్న షిరిడీ బృందావనం సభ్యులు మాట్లాడుతూ తొమ్మిది రోజులు రాజశ్యామల యాగం, గురూజీ చేతులు మీదుగా ప్రతిరోజు కుంకమ పూజలు నిర్వహించారు. సర్వలోక కల్యాణం కోసం హిమాలయ గురూజీ తొమ్మిది రోజుల పాటు మౌన దీక్షచేపట్టి భక్తులకు ఆశీర్వచనాలు అందచేశారు. అనందరం అన్నదానం చేశారు.



కొచ్చెర్లలో మహిషాసురమర్ధినిగా పార్వతీదేవి

## కన్యకా పరమేశ్వరి ఆలయంలో...

దేవీ నవరాత్రులు బాగంగా తొమ్మిదో రోజు కన్యకాపరమేశ్వరి అమ్మవారిని మహిశాసురమద్ధిని అమ్మవారిగా అలంకరించి భక్తులకు ప్రత్యేక దర్శనమిచ్చారు. కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వస్త్రాలంకరణలో 1000 జల కలశాలతో నగరోత్సవం చేపట్టారు. 100మంది చిన్నారులతో హరి హర కోలాట బృందంతో కోలాటం ప్రదర్శించి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. అదేవిధంగా ఎన్ ఎస్‌పీ కాలనీ ఆవరణలోని అలితాంబికా అమ్మవారి దేవాలయంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేకువజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాత శివాలయం, అంకాలమ్మ తల్లి దేవస్థానంలో తొమ్మిది రోజులు పాటు భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

## శ్యావల్యాపురం మండలంలో...

శావల్యాపురం, అక్టోబరు 11: దసరా పండుగను పురస్కరించుకుని మండలంలోని కారుమంచి, మతుకుమల్లి, బొందిలిపాలెం, శావల్యాపురం, కొత్తలూరు, పోట్లూరు, ఘంటవారిపాలెం, వేల్పూరు తదితర గ్రామాల్లో నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా చివరి రోజు భక్తులు కనకదుర్గమ్మను, మహిషాసురమర్ధిని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శావల్యాపురం రైల్వేస్టేషన్ మార్గంలోని నీలంపాటి అమ్మవారి దేవాలయంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ విగ్రహం వద్ద ఆలయ చైర్మన్ మద్దినేని హరిబాబు ఆధ్వర్యంలో పోట్లూరు పంచాయతీ పరిధిలోని అద్దంకి బ్రాంచి కెనాల్ వద్ద ఉన్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ దేవాలయంలో ధర్మకర్త గోనుగుంట్ల వెంకట్రావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు

## బొల్లాపల్లి మండలంలో...

బొల్లాపల్లి, అక్టోబరు 11: మండలంలోని వెల్లటూరు, పేరూరుపాడు, బొల్లాపల్లి, వడ్డెంగుంట, నాయుడుపాలెం గ్రామాల్లో నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నాయుడుపాలెం కోదండ రామ దేవాలయంలో శుక్రవారం అమ్మవారికి హోమాలు చేశారు. వెల్లటూరు శ్రీ రుక్మిణీ సత్యభామ గంగా పార్వతి సమేత సోమేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు

## నూజెండ్ల మండలంలో...

నూజెండ్ల, అక్టోబరు 11: మండలంలోని ప్రముఖ దేవాలయాల్లో దుర్గాష్టమి సందర్భంగా మహిషాసుర మర్ధినిగా అమ్మవారు పూజలు అందుకున్నారు. రవ్వవరం శ్రీ వెంకటేశ్వర జగన్నాతపీఠం, నూజెండ్ల, అప్పాపురం చెన్నకేశవ స్వామి దేవాలయాలు, ఐనవోలు, జెడ్డావారిపాలెం దేవాలయాల్లో జరిగిన దసరా ఉత్సవాల్లో భక్తులు విశేషంగా పాల్గొని పూజలు నిర్వహించారు.

● ఈపూరు, అక్టోబరు 11: దసరా శరన్నవరాత్రులలో భాగంగా శుక్రవారం కొచ్చెర్ల పార్వతీదేవిని మహిషాసుర మర్ధిని గా అలంకరించారు. అంకాళపరమేశ్వరిని పూలతో అలంకరించి పూజలు చేశారు.



నూజెండ్ల వెంకటేశ్వర జగన్నాత పీఠంలో దుర్గాష్టమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



దేవీ నవరాత్రుల్లో పాల్గొన్న మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి దంపతులకు పట్టు వస్త్రాలు అందజేస్తున్న హిమాలయ గురూజీ



# రహదారిపై భారీ గుంతలు

● ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

చిలకలూరిపేట అక్టోబరు 11: పట్టణంలోని ఐటీసీ కంపెనీ సమీపంలో నరసరావుపేట రోడ్డు నుంచి వెళ్లే పాతసంత రోడ్డు ప్రారంభంలో భారీ గుంతలతో ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతున్నది. వర్షం పడితే గుంతలలో నీరు నిలిచి రోడ్డు మార్గం కనిపించకుండా పోతున్నది. కనీస మరమ్మతులు కూడా చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఆ మార్గం గుండా కుమ్మర కాలనీ, ఎన్టీఆర్ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. పెద్ద సంఖ్యలో అపార్టుమెంట్లు కూడా ఉన్నాయి.

ప్రజలు పాతాళానికి పడవేసినా

# జగన్ ప్రగల్భాలు తగ్గలేదు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



మెటల్ రోడ్డు శిలఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

నాదెండ్ల, అక్టోబరు 11: గడిచిన ఎన్నికల్లో ప్రజలు పాతాళానికి పడవేసినా జగన్ ప్రగల్భాలు మాత్రం తగ్గలేదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని ఇర్లపాడు గ్రామ పరిధిలోని కేంద్రీయ విద్యాలయం నుంచి హెచ్‌బీఎల్ కంపెనీ వరకు రూ. 40 లక్షల ఉపాధి హామీ నిధులతో ఏర్పాటు చేయనున్న మెటల్ రోడ్డుకు పుల్లారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నాలుగు నెలల పాలనపై మాజీ ముఖ్యమంత్రి జగన్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఎద్దేవా చేశారు. ఐదు సంవత్సరాల పాలనలో గుంతలు పడిన, ధ్వంసమైన రోడ్లే సాక్ష్యమని చురకలు వేశారు. ఇదేనా? ప్రజలకు జగన్ చేసిన మేలని విమర్శించారు. గతంలో ఏ ప్రభుత్వం ఉన్నా రోడ్ల నిర్వహణ, నిర్మాణం, విస్తరణకు కనీస నిధులు కేటాయించేవారని, వాటిని కూడా మంగళం పాడిన ఘనుడు జగన్‌రెడ్డి అన్నారు. ఉపాధి హామీ, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో వాటన్నింటికీ పరిష్కారం చూపించాల్సి ఉందన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న పల్లె పండుగ కార్యక్రమంలో గ్రామీణ సమస్యలు తీర్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, ఎంపీడీవో స్వరూపరాణి, సర్పంచ్ కోటేశ్వరమ్మ, పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, ఏఈ వెంకటేశ్వరరావు, నాయకులు అలూరి రమణయ్య, నాగేశ్వరరావు, నాగ పూర్ణచంద్రరరావు, జయ ప్రసాదు, సురేష్, ఉపేంద్ర, రాఘవయ్య, గట్టినేని రమేష్, నెల్లూరి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



బోయపాలెం సెంటర్‌లోని అండర్ పాస్‌లో నిలిచిన వర్షపు నీరు

# అండర్‌పాస్‌లలో వర్షపు నీరు

● ప్రయాణికులకు ఇక్కట్లు

యడ్లపాడు, అక్టోబరు 11: ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు రహదారులపై వంతెనలు, బ్రిడ్జిలు ఏర్పాటు చేయడం సహజం. గ్రామాల మధ్య నుంచి రహదారులు వెళుతున్నట్లయితే ఇరువైపులా నివసించే వారు రాకపోకలు సాగించేందుకు అండర్ పాస్ వంతెనలు, వాగులు, నదులపై నీరు దిగువ నుంచి ప్రవహించేలా వంతెనలు, బ్రిడ్జిల నిర్మాణం జరుగుతుంది. అయితే హైవే అధికారులు 16వ నంబరు జాతీయరహదారిపై ఏర్పాటుచేసిన వంతెనలు అందుకు భిన్నంగా అగుపిస్తున్నాయి. ప్రణాళికా లోపమో లేదా అధికారుల నిర్లక్ష్యమో తెలీదు కాని ప్రజల పాలిట శాపంగా మారింది. దశాబ్దం కిందట కోల్‌కత-చెన్నై 16వ నంబరు రహదారిని ఆరు లైన్లుగా విస్తరణ చేశారు. ఈ క్రమంలో మండలంలోని వంకాయలపాడు, బోయపాలెం, యడ్లపాడు గ్రామాల పరిధిలో ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు అండర్‌పాస్‌లను నిర్మించారు. అయితే అండర్‌పాస్‌లు సర్వీస్ రోడ్డుకన్నా దిగువకు ఉండడంతో చిన్నపాటి వర్షం కురిసినా వంతెన కింద నీరు నిలిచి పాదచారులు, ద్విచక్రవాహనాలు సైతం వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. వంతెనలు నిర్మించినప్పటి నుంచి ఈ సమస్య నెలకొంది. వర్షం వచ్చినప్పుడల్లా ప్రజలు ఇబ్బంది పడుతున్నా హైవే అధికారులు మాత్రం ఏ మాత్రం స్పందించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## వైరల్ జ్వరాలపై వైద్య శిబిరం

బొల్లాపల్లి, అక్టోబరు 11: మండలంలోని పలు గ్రామాల్లో ప్రబలిన వైరల్ జ్వరాలపై శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. కారంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వైద్యాధికారి డాక్టర్ ఎం.రమ్య ఆధ్వర్యంలో జిల్లా మెడికల్ అధికారి వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు లాలీపురం, రాజా నాయక్ తండా, హనుమాపురం గ్రామాల్లో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటికి సర్వే నిర్వహించి డెంగీ, సీజనల్ జ్వరాలు రాకుండా అప్రమత్తంగా ఉండాలని, మెడికల్ క్యాంపు నిర్వహించి ప్రజలకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మా నాయక్, వైద్య సిబ్బంది డాక్టర్ రమ్య, సీహెచ్‌వో కే మల్లయ్య, హెచ్ఎస్ మస్తాన్‌వలి, ఏఎన్ఎం డీ రమాదేవి బాయి, రాణి, శివ, లాలు నాయక్, నాగమణి, వరలక్ష్మి బాయి, చంద్రకళ, ఆషా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.






బ్లడ్ కలెక్షన్ వ్యాన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జిల్లా రెడ్ క్రాస్ సొసైటి చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు

# బ్లడ్ సెంటర్ సేవలను వినియోగించుకోండి

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 11: జిల్లా వైద్యశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా శాఖ బ్లడ్ సెంటర్‌ను అద్భుతంగా ఏర్పాటు చేసిందని, రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం జిల్లా వైద్యశాలలో బ్లడ్ సెంటర్‌కు ఐసీఐసీఐ ఫౌండేషన్ ద్వారా విరాళంగా అందజేసిన బ్లడ్ కలెక్షన్ వ్యాన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. రెడ్ క్రాస్ సొసైటీ ఏర్పాటుచేసిన బ్లడ్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఈ బ్లడ్ సెంటర్‌ను నవంబరు 10న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రారంభిస్తారన్నారు. నరసరావుపేటలోని జిల్లా వైద్యశాల 200 పడకల సామర్థ్యం కలిగి ఉందని, పేద ప్రజలకు రోగులందరికీ సేవలు అందిస్తుందన్నారు. ఇదే వైద్యశాలలో 1000 ప్యాకెట్ల బ్లడ్, బ్లడ్ కాంపోనెంట్స్‌తో నిల్వ సామర్థ్యం ఉన్న బ్లడ్ సెంటర్ ఏర్పాటు చేశారన్నారు. తలసేమియా, హిమోఫీలియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలినప్పుడు, రహదారి ప్రమాదాలు జరిగిన వారికి అందించడానికి బ్లడ్ సెంటర్ సిద్ధంగా ఉందన్నారు. బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ మాట్లాడుతూ బ్లడ్ బ్యాంక్‌కు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని చెప్పారు. పట్టణ ప్రజలు కూడా బ్లడ్ బ్యాంక్‌కు తమ వంతుగా విరాళాలను అందించవచ్చని అన్నారు. జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర రెడ్ క్రాస్ శాఖ సహకారంత రెడ్ క్రాస్ నేషనల్ హెడ్ సెంటర్ ఢిల్లీ చేత జిల్లాకు బ్లడ్ సెంటర్ మంజూరు అయిందని, దానికి కావలసిన స్థలాన్ని జిల్లా కలెక్టర్ నూతన ప్రభుత్వ వైద్యశాలలో అందించారన్నారు. అనంతరం ఏడాది కాలంలో బ్లడ్ సెంటర్ నిర్మాణాన్ని పూర్తి చేశామని చెప్పారు. బ్లడ్ సెంటర్‌కు సంబంధించి లైసెన్స్‌ను డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్, డ్రగ్స్ కంట్రోలర్ అడ్మినిస్ట్రేషన్ ఢిల్లీ మంజూరు చేసిందన్నారు. త్వరలో ఈ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ప్రారంభించడం కోసం ఎమ్మెల్యే చదలవాడను కోరగా సందర్శించడం జరిగిందన్నారు, కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ పీవీఎం శరత్‌బాబు, కోశాధికారి గంగ్రకోట మురళీకృష్ణ, మేనేజింగ్ కమిటి సభ్యులు కేఎంఎన్‌వీ శ్రీనివాసగుప్తా, బత్తుల మురళి, డాక్టర్ రెహమతుల్లా,డాక్టర్ స్వజనా, బ్లడ్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మురళి, ప్రభుత్వ వైద్యశాల డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరెడ్డి, ప్రభుత్వ వైద్యశాల సూపరిటెండెంట్ డాక్టర్ మంత్రునాయక్, ఆర్ఎంవో డాక్టర్ ఏడుకొండలు, మస్తాన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.







చిలకలూరిపేట నియోజకవర్గంలో

## 17 మద్యం దుకాణాలకు 188 దరఖాస్తులు

చిలకలూరిపేట, అక్టోబరు 11: చిలకలూరిపేట నియోజకవర్గంలో మద్యం దుకాణాలకు శుక్రవారం గడువు ముగిసే సమయానికి 27దుకాణాలకు సగటున 11 చొప్పున దరఖాస్తులు దాఖలయ్యాయి. నాన్ రిఫండబుల్ దరఖాస్తు ఫీజు కింద ఒక్కొక్క దుకాణానికి రూ.2 లక్షలు చొప్పున మొత్తం రూ.3.76 కోట్లు ప్రభుత్వానికి ఆదాయంగా లభించింది. నియోజకవర్గం పరిధిలో మొత్తం 17 మద్యం దుకాణాలకు ఎక్సైజ్ శాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. శుక్రవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో సేకరించిన సమాచారం ప్రకారం మొత్తం 17 దుకాణాలకు 188 దరఖాస్తులు దాఖలు అయ్యాయి. పట్టణంలో 6, చిలకలూరిపేట మండలంలో 3, యడ్లపాడు మండలంలో 3, నాదెండ్ల మండలంలో 5 చొప్పున దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. గతంలో నాదెండ్ల మండలంలో 3 మద్యం దుకాణాలు ఉండగా ఈసారి మరో 2 పెరిగి ఈ సంఖ్య 5కు చేరింది.



యర్రబాలెం-ఊడిజర్ల రోడ్డు పరిస్థితి

# అధ్వానంగా రహదారులు

ఈపూరు, అక్టోబరు 11: మండలంలో రోడ్లు అధ్వానంగా ఉండి రాకపోకలకు తీవ్ర అంతరాయంగా ఉన్నాయి. ఆ రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా ఉంది. ఈపూరు నుండి యర్రబాలెం, ఊడిజర్ల వెళ్ళే రోడ్డు అడుగుకో గుంత-గజానికో గొయ్యి ఏర్పడి అధ్వానంగా ఉంది. దశాబ్దాలుగా రోడ్డుకు మరమ్మతులు లేక భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతులలో ప్రయాణం నరకంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయి. పాలకులు, అధికారులు స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుచున్నారు.



ఈపూరు-ఊడిజర్ల రోడ్డుపై గోతులలో నిలిచిన వర్షం నీరు



ఆంధ్రజ్యోతి
పల్నాడు జిల్లా వార్తలు





నరసరావుపేట భీమలింగేశ్వర స్వామి అలయంలో మహిషారమర్ధిని అలంకారంలో పార్వతీదేవి అమ్మవారు

# జయహే మహిషాసుర మర్ధిని

నరసరావుపేట, అక్టోబరు 11: నరసరావుపేట పట్టణంలోని దేవాలయాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు వేలాదిగా ఆలయాలకు తరలివచ్చి అమ్మవారి ప్రత్యేక అలంకారాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం పాతూరులోని గంగా పార్వతి సమేత భీమలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతిదేవి అమ్మవారికి మహిషాసురమర్ధిని అలంకారం చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శృంగేరి శంకరమఠంలో శారదాంబ అమ్మవారికి చండీ అలంకారం చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆయా ఆలయాల్లో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన రహదారుల్లోని, గడియార స్తంభం సెంటర్లలో మహాలక్ష్మమ్మ చెట్ల వద్ద, రామిరెడ్డిపేటలోని చౌడేశ్వరిదేవి ఆలయం, పాతూరులోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు.

## ఇస్సపాలెంలో...

నరసరావుపేట టౌన్, అక్టోబరు 11: నరసరావుపేట మండలం ఇస్సపాలెంలో చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో శరన్న నవరాత్రులు సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు భక్తులకు 9వ రోజు మహిషాసురమర్ధినిగా దర్శనం ఇచ్చారు. కార్యక్రమంలో దాసరి నరసింహారావు, కమీటి సభ్యులు, తొగట వీర క్షత్రియ సంఘం నాయకులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

## ఎన్జీవో కాలనీ, బరంపేటలో దసరా నవరాత్రి వేడుకలు

ననరావుపేట టౌన్, అక్టోబరు 11 పట్టణంలోని ఎన్జీవో కాలనీలో శరన్ననవరాత్రుల పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహిషాసురమర్ధిని అలంకారంలో ఉన్న అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, సుధారాజేశ్వరి దంపతులు దర్శించుకున్నారు. అదే విధంగా బరంపేటలోని వివిధ ఆలయాలలో శరన్న నవరాత్రుల సందర్భంగా జరుగుతున్న వేడుకలలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ అమ్మవారి కరుణతో ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు కురిసి పంటలు పండుతున్నాయన్నారు. అదే విధంగా వ్యాపారులు, ఉద్యోగులు సుఖ సంతోషాలతో తమ వృత్తులను కొనసాగించాలన్నారు. దేవీ శరన్న నవరాత్రులను నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. డాక్టర్ చదలవాడ దంపతులకు మాజీ కౌన్సిలర్ కొండ్రకుంట లక్ష్మి, కనుమూరి లక్ష్మి, మహిళలు స్వాగతం పలికారు.



మహిషాసురమర్ధినిగా ఇస్సపాలెం చౌడేశ్వరి అమ్మవారు



సొలస బ్రహ్మంగారి ఆలయంలో ...

## నాదెండ్ల మండలంలో...

నాదెండ్ల, అక్టోబరు 11: మండలంలోని పలు గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. కాగా గణపవరం, నాదెండ్ల, సాతులూరు తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన దేవాలయాలు, చలువ పందిళ్ళల్లో అమ్మవారు మహిషాసుర మర్దని అవతారంలో దర్శన మిచ్చారు.

## రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల, అక్టోబరు 11: మండలంలోని గ్రామాల్లో దేవీ నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. రొంపిచర్ల, వడ్లమూడివారిపాలెం, విప్పర్ల, కొత్తపల్లి, వీరవట్నం గ్రామాల్లో దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. రొంపిచర్ల వాసవి అమ్మవారు, విప్పర్లలోని కామాక్షి అమ్మవారు మహిషాసురమర్ధిని అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. సింహవాహనంపై అమ్మవారు భక్తులకు అభయం ఇచ్చారు. ఆలయ ఆవరణలో చండీ హోమం, రుద్రాభిషస్త్రక పూజలు జరిగాయి. దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త మద్ది రామచంద్రరరావు, రామబ్రహ్మానందరావు, గొడవర్తి వెంకటేశ్వర్లు, కొప్పు కోటయ్య గొడవర్తి శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు. కాగా దసరా పర్వదినం రోజున అమ్మవారు రాజ రాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శన మివ్వనున్నారు. ఆలయాలకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. గోగులపాడులోని వేణుగోపాల స్వామి ఆలయంలో బతుకమ్మను ఏర్పాటు చేశారు.



ఎన్జీవో కాలనీలో అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే చదలవాడ దంపతులు

## యడ్లపాడు మండలంలో...

యడ్లపాడు, అక్టోబరు 11: మండలంలోని బోయపాలెం పార్వతీదేవి ఆలయం, యడ్లపాడు శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం, లింగారావుపాలెం, జగ్గాపురం, తిమ్మాపురం, ఉన్నవ, కొండవీడు శివాలయాలలో, సొలస బ్రహ్మంగారి ఆలయంలోని అమ్మవార్లను మహిషాసురమర్ధినిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోయపాలెం పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి పొంగళ్ళు పొంగించి నైవేద్యంగా సమర్పించారు.



గణపవరం కోదండ రామ స్వామి దేవాలయంలో మహిషాసురమర్ధిని అవతారంలో అమ్మవారు



మహిషాసురమర్ధిని అలంకారంలో రొంపిచర్ల వాసవి అమ్మవారు,



విప్పర్ల కామాక్షి అమ్మవారు



మహిషాసుర మర్దినిగా బోయపాలెం పార్వతీదేవి అమ్మవారు